# కరీంనగర్ వార్త



కరీంనగర్ - జగిత్యాల - పెద్దపల్లి - రాజన్నసిరిసిల్ల

గురువారం 14, మే 2026 | 16 పేజీలు




2 లో..

## ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చెయ్యాలి

**మంత్రి పొన్నం ప్రభాకర్**

చిగురుమామిడి, ప్రభాతవార్త

చిగురుమామిడి మండలం నవాబుపేట గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం రోజున మంత్రి పొన్నం ప్రభాకర్ పరిశీలించడం జరిగింది. మంత్రి మాట్లాడుతూ వరి ధాన్యం కొనుగోల్లు వేగవంతం చేయాలని,




2 లో..

# గుండె పరీక్ష.. పదిలమేనా?

## ప్రాణాలతో చెలగాటం




2 లో..

**కరీంనగర్‌లో 2డి ఎకో దందా..!**

**గుండె పరీక్షల పేరుతో నిలువు దోపిడీ..**

**ల్యాప్‌టాప్‌లే వైద్య పరికరాలైతే..?**

**టెక్నీషియన్లే డాక్టర్లు...!**

కరీంనగర్ టౌన్,ప్రభాతవార్త

గుండె పరీక్షల పేరుతో నిలువు దోపిడీ....కరీంనగర్ కేంద్రంగా కొన్ని హాస్పిటల్స్ లో జరుగుతున్న మోసాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి.. ఆసు పత్రుల ముసుగులో అమాయక ప్రజల ప్రాణాలతో చెలగాటమాడు తున్న మరో చీకటి దందా వెలుగు లోకి వచ్చింది. గుండె పనితీరును అంచనా వేసే అత్యంత కీలకమైన '2డి ఎకో' పరీక్షలు ప్రస్తుతం అర్హత లేని వ్యక్తుల చేతుల్లోకి వెళ్లాయనే వార్తలు వినిపిస్తున్నాయి.నిపుణులైన కార్డియాలజిస్టులు చేయాల్సిన పరీక్షలను, కేవలం ఒక ల్యాప్‌టాప్ చేతిలో పట్టుకుని తిరిగే అన్‌సర్టిఫైడ్ టెక్నీషియన్స్ నిర్వహిస్తూ లక్షలు గడిస్తున్నారనే ఆరోపణలు లేకపోలేదు..

**దందా సాగుతోందిలా...**

జిల్లా కేంద్రంలోని కొన్ని ప్రైవేట్ ఆసుపత్రులు, డయాగ్నస్టిక్ సెంటర్లు లాభాలే ధ్యేయంగా నిబంధనలను తుంగలో తొక్కుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి.ఒకే వ్యక్తి ఉదయం ఒక ఆసుపత్రి, మధ్యాహ్నం మరో సెంటర్ చొప్పున ల్యాప్‌టాప్, పోర్టబుల్ స్కానింగ్ పరికరంతో చక్కర్లు కొడుతున్నట్లు తెలుస్తోంది..పరీక్ష చేసే సమయంలో స్పెషలిస్ట్ డాక్టర్ అందుబాటులో ఉండరు,కానీ టెక్నీషియన్ ఇచ్చే రీడింగ్స్ ఆధారంగా.. ఎక్కడో ఉన్న డాక్టర్ సంతకం పెట్టి రిపోర్ట్ సిద్ధం చేస్తున్నారనే ఆరోపణలు లేకపోలేదు.. నైపుణ్యం,అర్హతలులేని వ్యక్తులు చేసే ఈ పరీక్షలతో గుండె సమస్యలు ఉన్నవారికి లేవని,లేనివారికి ఉన్నాయని తప్పుడు



2వ పేజీలో...

## మెరుగైన వైద్య సేవలు అందించాలి

**జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

**ఐడీఓసీలో జిల్లా ఆసుపత్రి అధికారులతో సమీక్ష**

పెద్దపల్లి జిల్లా బ్యూరో, ప్రభాతవార్త

జిల్లా ఆసుపత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అధికారులను ఆదేశించారు. బుధవారం ఐడీఓసీ కార్యాలయంలో జిల్లా ఆసుపత్రికి సంబంధించిన అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష పాల్గొన్నారు.



2వ పేజీలో...

## మంత్రి అడ్లూరికి తృటిలో తప్పిన ప్రమాదం

కరీంనగర్ టౌన్,ప్రభాతవార్త:

కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ హాస్పిటల్ లో గొల్లపల్లి మండలానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్తనిపరామర్శించి లిఫ్ట్ లో కిందికి వెళ్తుండగా రెండో ఫ్లోర్ నుండి నియంత్రణ కోల్పోయిన లిఫ్ట్ గ్రౌండ్ ఫ్లోరీకి వెళ్ళినట్లు సమాచారం.వేగంగా వచ్చి గ్రౌండ్ ఫ్లోర్‌కు లిఫ్ట్ తాకడంతో కుదుపునకు గురైనట్లు తెలుస్తోంది. ఈ ఘటనలో మంత్రికి ఎలాంటి ప్రమాదం జరగలేదని తెలుస్తోంది.పోలీసులుఘటనస్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు.



2వ పేజీలో...

## చివరి గింజ వరకు ధాన్యం కొనుగోలు చేస్తాం

**టిప్పర్ ప్రమాదంలో గాయపడ్డ రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుంది**

**: మంత్రి అడ్లూరి**

గొల్లపల్లి, ప్రభాతవార్త

రైతులు పండించిన పంటను చివరి గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ స్పష్టం చేశారు. గొల్లపల్లి మండల కేంద్రంలో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని బుధవారం







## గుండె పరీక్ష పదిలమేనా....?

### మొదటి పేజీ తరువాయి..

రిపోర్టులు వచ్చే ప్రమాదం పొంచి ఉందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేసిన సందర్భాలు లేకపోలేదు.

**నిబంధనలు ఏం చెబుతున్నాయి...?**

జిల్లా వైద్య ఆరోగ్య శాఖ తాజాగా జారీ చేసిన సర్క్యులర్ ప్రకారం... ప్రీకాన్సెప్షన్ అండ్ ప్రీ నాటల్ డయాగ్నొస్టిక్ టెక్నిక్స్ యాక్ట్ 1994 (పిసిపీఎన్డిటిచట్టం) నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఆదేశాలు జారీ చేశారు. అందులో ఉన్న నిబంధనల మేరకు కేవలం రిజిస్టర్ అయిన కేంద్రాల్లోనే 2డి ఎకో యంత్రాలను వాడాలి. అనుమతి లేకుండా మొబైల్ లేదా పోర్టబుల్ యంత్రాలను ఒక చోట నుండి మరోచోటికి తరలించి పరీక్షలు చేయడం నిషిద్ధం. కేవలం కార్డియాలజిస్టులు లేదా గుర్తింపు లేదా శిక్షణ పొందిన నిపుణులు మాత్రమే ఈ పరీక్షలు నిర్వహించాలనీ నిబంధనలు చెబుతున్నాయి... కానీ నిబంధనలు ఆచరణలో లేనట్లు తెలుస్తోంది..

**అడ్డుకట్ట పడేనా..?**

జిల్లా వైద్య ఆరోగ్య శాఖ నిబంధనలు జారీ చేసినప్పటికీ, క్షేత్రస్థాయిలో తనిఖీలు జరగక పోవడంపై విమర్శలు వస్తున్నాయి. వేల రూపాయలు వెచ్చించి పరీక్షలు చేయించుకుం టున్న రోగులు, వారికి అందుతున్న వైద్యం నామ్ కే వాస్తే...లేక నిజమైనదా...అనే సందిగ్ధంలో కొన్ని సందర్భాల్లో పడినట్లు సమాచారం.. రోగులు 2డి ఎకో పరీక్ష చేయించుకునే ముందు సదరు ఆసుపత్రికి అనుమతి ఉందో లేదో, పరీక్ష చేసేది అర్హత గల డాక్టరో కాదో సరిచూసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. అధికారులు కేవలం సర్క్యులర్లతో సరిపెట్టకుం డా, ఆకస్మిక తనిఖీలు నిర్వహించి అక్రమ కేంద్రాలపై కేసులు నమోదు చేయాలనీ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు..ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుకునే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలనీ ప్రజలు కోరుతున్నారు... ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నిబంధనలకు విరుద్ధంగా జిల్లాలో కొనసాగుతున్న 2డి ఎకో పరీక్ష కేంద్రాలపై, విచారణ జరిపించి ఎటువంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి...



# వరి ధాన్యం కొనుగోళ్ల వేగం పెంచాలి

**కొనుగోళ్ల ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలి**

**అధికారుల సమన్వయంతో పని చేయాలి**

**జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్**

జగిత్యాల బ్యూరో ప్రభాతవార్త



వరి ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలని జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ పేర్కొన్నారుజగిత్యాల జిల్లాలో యాసంగి వరి ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను వేగవంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు వివిధ శాఖల అధికారులు మరియు ట్రాన్స్‌పోర్టర్ల యజమానులతో జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్, జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తో కలిసి ప్రత్యేక సమావేశాన్ని బుధవారం కలెక్టరేట్ లోని మినీ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సమావేశంలో ధాన్యం రవాణా, నిల్వలు, గోడౌన్లకు తరలింపు, లారీల అందుబాటు తదితర అంశాలపై సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూజిల్లాలో రైతులు కొనుగోలు కేంద్రాలకు తీసుకొస్తున్న ధాన్యాన్ని ఎలాంటి ఆలస్యం లేకుండా మిల్లులు, గోడౌన్లకు తరలించేలా ట్రాన్స్‌పోర్టర్లు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం నిల్వలు పేరుకుపోకుండా అవసరమైన సంఖ్యలో లారీలను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ప్రస్తుతం వర్షాకాల పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ధాన్యం తడవకుండా తక్షణ రవాణా చర్యలు చేపట్టాలని తెలిపారు. రైతులు ఇబ్బందులు పడకుండా ప్రతి కొనుగోలు కేంద్రానికి అవసరమైన వాహనాలను కేటాయించాలని సూచించారు. రవాణాలో నిరక్ష్యం, జాప్యం జరిగితే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ధాన్యం లోడింగ్, అన్‌లోడింగ్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని, హమాలీలతో సమన్వయం చేసుకుంటూ పనిచేయాలని ట్రాన్స్‌పోర్టర్లకు సూచించారు. కొనుగోలు కేంద్రాల వారీగా రోజువారీ రవాణా ప్రణాళిక రూపొందించి అమలు చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ ) బి. ఎస్ లత, రవాణా శాఖ అధికారులు, సివిల్ సప్లై అధికారులు, మార్కెటింగ్ శాఖ అధికారులు, ట్రాన్స్‌పోర్టర్ల యజమానులు మరియు తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చెయ్యాలి

### మొదటి పేజీ తరువాయి..

రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని, అధికారులు అలసత్వం వద్దని హెచ్చరించారు. ధాన్యం భారీగా వస్తుండడంతో గన్ని సంచుల కొరత లేకుండా చూసుకోవాలని, ప్రతి కొనుగోలు కేంద్రానికి కాంట పూర్తయిన వెంటనే ధాన్యం సంచులను లారీల్లో మిల్లులకు పంపించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అకాల వర్షం వస్తే ధాన్యం తడవకుండా టార్పాలిన్ అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ధాన్యం రవాణా తరలింపుకు ఇబ్బందులు లేకుండా ప్రత్యేకంగా ఎంవిఐ అధికారిని కూడా నియమించామని, ఎండల్లో హమాలీలు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతి రెడ్డి, సర్పంచ్ గుళ్ళ రజిత రాజు, ఉప సర్పంచ్ ఇనుగాశ్రీనివాస్ రెడ్డి, పంచాయతీ సెక్రటరీ బడుగు సంపత్ కుమార్, వ్యవసాయ విస్తరణ అధికారి సాయి తదితరులు పాల్గొన్నారు. అనంతరం గ్రామం లో ఇటీవల నిర్మాణం పూర్తి అయిన ఇందిరమ్మ ఇండ్లను కూడా మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు.

## మెరుగైన వైద్య సేవలు అందించాలి

### మొదటి పేజీ తరువాయి..

ఈ సందర్భంగా లిజిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ,లి పెద్దపల్లి జిల్లా ఆసుపత్రి ప్రజలకు మంచి వైద్య సేవలు అందిస్తూ విశ్వాసాన్ని సంపాదించుకుందని తెలిపారు. వైద్యులు, సిబ్బంది అందిస్తున్న సేవలను అభినందించారు. నర్సింగ్ సిబ్బంది, ఇతర సిబ్బంది కూడా రోగులు, వారి కుటుంబ సభ్యులతో సౌమ్యంగా, మర్యాదపూర్వకంగా మాట్లాడాలని సూచించారు. రోగులతో వ్యవహరించే విధానంపై నర్సులకు ప్రత్యేక అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఆసుపత్రిలో రేడియాలజీ, ఆప్తమాలజీ, డెంటల్ ఓపి సేవలను మరింత మెరుగుపర్చాలని సూచించారు. రోగుల రద్దీ అధికంగా ఉన్నప్పటికీ ఫిజియోథెరపీ సేవల నాణ్యత ఏమాత్రం తగ్గకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఆసుపత్రి పారిశుద్ధ్యానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఆసుపత్రి ప్రాంగణాన్ని నిరంతరం శుభ్రంగా ఉంచాలని, రోగుల రద్దీ ఎక్కువగా ఉన్న నేపథ్యంలో పారిశుద్ధ్య నిర్వహణలో ఎలాంటి నిరక్ష్యం ఉండకూడదన్నారు. అవసరమైతే అదనపు పారిశుద్ధ్య సిబ్బందిని నియమించాలని సూచించారు. రోగులకు తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్ల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో డీసీహెచఎస్ డాక్టర్ శ్రీధర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్, వైద్యులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# చివరి గింజ వరకు ధాన్యం కొనుగోలు చేస్తాం

### మొదటి పేజీ తరువాయి..

ఆయన సందర్శించి రైతులు, అధికారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మండలంలో వరి ధాన్యం, మొక్కజొన్న పెద్ద ఎత్తున కొనుగోలు కేంద్రాలకు వస్తున్న నేపథ్యంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. వరి ధాన్యం కొనుగోళ్లలో కేంద్ర ప్రభుత్వం ఆన్లైన్ వెహికల్ ట్రాకింగ్ సిస్టమ్ అమలు చేయడంతో ప్రారంభంలో అధికారులు, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని పేర్కొన్నారు. ఈ సమస్యపై రాష్ట్ర ముఖ్యమంత్రి కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాసి పాత విధానంలోనే కొనుగోళ్లు చేపట్టాలని కోరడంతో కొనుగోలు ప్రక్రియ వేగవంతమైందన్నారు. అయితే ఈ కారణంగా కొనుగోలు కేంద్రాలు దాదాపు 20 రోజుల ఆలస్యంగా ప్రారంభమయ్యాయని తెలిపారు. లారీల కొరత లేదా హమాలీల సమస్య ఉన్నట్లయితే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని రైతులకు సూచించారు. రైస్ మిల్లర్లతో అధికారులు ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరుపుతూ కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసేలా చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. గత ప్రభుత్వం రైతుల సమస్యలను పట్టించుకోలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎలాంటి కటింగులు లేకుండా ధాన్యం కొనుగోళ్లు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్రంలోనే అత్యధికంగా జగిత్యాల జిల్లాలో ధాన్యం



కొనుగోళ్లు జరిగాయని తెలిపారు. జిల్లాలో 18 రైస్ మిల్లులు పెనాల్టీలు చెల్లించకపోవడంతో బ్లాక్‌లిస్ట్‌లో చేరాయని, ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన ముఖ్యమంత్రి బ్యాంకు గ్యారంటీ ఆధారంగా మిల్లులకు తిరిగి అనుమతులు మంజూరు చేశారని వెల్లడించారు. అనంతరం తిరుమలాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ని పూలమాలతో సత్కరించారు. బాధిత రైతులకు అండగా ఉంటాం మండల కేంద్రంలో నిర్వహిస్తున్న మొక్కజొన్న కొనుగోలు కేంద్రంలో మంగళవారం సాయంత్రం జరిగిన టిప్పర్ ప్రమాదంలో గాయపడిన రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని వైద్య ఖర్చులు ప్రభుత్వ పరంగా లేదా సొంతంగా భరిస్తానని అన్నారు. అలాగే మొక్కజొన్న రైతుకు నష్టం జరగకుండా మొక్కజొన్నను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని లేనిపక్షంలో పంటకు సంబంధించిన పూర్తి పరిహారాన్ని అందించే బాధ్యత నాదేనని ఈ సందర్భంగా మంత్రి అన్నారు. హమాలీల కొరత లేకుండా చూడాలి మండలంలోని గుంజపడుగులో హమాలీల కొరత కారణంగా కొనుగోలు నిలిచిపోవడంతో మంత్రి గుంజపడుగు మీదుగా తిరుమలాపూర్ వెళ్తుండగా కొనుగోలు కేంద్రం వద్ద రైతులను చూసి ఆగారు. ఈ సందర్భంగా రైతులు హమాలీల కొరత తీవ్రంగా ఉందని దానివల్ల ఇబ్బందులు పడుతున్నామని మంత్రి దృష్టికి తీసుకురావడంతో రేపటిలోగా అమాలీలను ఏర్పాటు చేసి ధాన్యాన్ని వెంట వెంటనే తరలించే ఏర్పాటు చేయాలని డిసిటిఓ ను ఆదేశించారు. ఈ సందర్భంగా రైతులు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి, మార్క్ఫెడియం, తాహసిల్దార్ ఎండి మజీద్, మార్కెట్ చైర్మన్ బీమా సంతోష్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముస్కు నిశాంత్ రెడ్డి, వివిధ గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచులు ,కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# ఓదెల మల్లన్న ఆలయాన్ని అన్ని అంగులతో అభివృద్ధి చేస్తాం

## -విప్ పేదల సొంత్నిటి కల నెరవేరుతుంది

## -ఎమ్మెల్యే విజయ రమణారావు



ఓదెల, ప్రభాతవార్త:

పెద్దపల్లి జిల్లాలోని అతి పెద్ద శైవ క్షేత్రమైన ఓదెల శ్రీ మల్లికార్జున స్వామి దేవాలయం అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు స్పష్టం చేశారు ఆలయం చుట్టూ సీసీ రోడ్డు నిర్మాణానికి డీఎంఎఫ్‌టీ నిధుల నుంచి రూ.కోటి మంజూరు చేసి శంకుస్థాపన చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబు సహకారంతో ఓదెల మల్లన్న ఆలయాన్ని దశలవారీగా అన్ని హంగులతో అభివృద్ధి చేస్తామన్నారు భక్తుల సౌకర్యార్థం రూ.15 లక్షలతో నూతన మరుగుదొడ్ల నిర్మాణం చేపడతామని అన్నారు భక్తుల సౌకర్యం కొరకు రోడ్డు పనులను త్వరలోనే పూర్తి చేస్తామని వెల్లడించారు ఇప్పటికే డబుల్ రోడ్డు, సెంట్రల్ లైటింగ్ పనులు పూర్తయ్యాయని చెప్పారు. ఈ సిసి రోడ్డు నిర్మాణం పనులు నూతన సాంకేతికతతో నిర్మాణం చేస్తామని ఈ సి సి రోడ్డు దీర్ఘకాలికంగా 40 సంవత్సరములు ఉంటుందని అన్నారు అనంతరం కనగర్తి, గుండ్లపల్లి గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమాల్లో పాల్గొని లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు.అలాగే గుండ్లపల్లి గ్రామంలో రూ.20 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు కాంగ్రెస్ ప్రభుత్వంలో పేదల సొంతింటి కల సాకారమవుతోందన్నారు. గ్రామాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని ప్రభుత్వ విప్ విజయ రమణారావు హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మూల ప్రేమ్ సాగర్ రెడ్డి, ఆలయ చైర్మన్ చీకట్ల మొండయ్య, సింగిల్ విండో చైర్మన్ ఆళ్ల సుమన్ రెడ్డి, మాజీ సర్పంచ్ ఆకుల మహేందర్, సర్పంచ్ల ఫోరం మండల అధ్యక్షులు పిట్టల రవికుమార్ స్థానిక సర్పంచ్ కనికి రెడ్డి సతీష్, కనగర్తి సర్పంచ్ చొప్పరి సంధ్యారాణికుమార్, గుండ్లపల్లి సర్పంచ్ పుప్పాల పుష్పశంకరయ్య, అబ్బిడి పల్లి సర్పంచ్ నరసింహారెడ్డి,ఆలయ ఈవో బి సదయ్య కాంట్రాక్టర్ ప్రదీప్ కుమార్ మాజీ వైస్ ఎంపీపీ అంబాల కొమురయ్య, మాజీ సర్పంచ్ అంకం రమేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు బొంగోని శ్రీనివాస్ గౌడ్ పచ్చిమట్ల శ్రీనివాస్ గౌడ్ గుండేటి మధు వంగా రాయమల్లు చింతం కుమారస్వామి తీర్థాల వీరయ్య నాగపురి రవి ఇందుర్తి శ్రీనివాస్ ఆలయ కమిటీ డైరెక్టర్లు స్థానిక వార్డు సభ్యులు ప్రజా ప్రతినిధులు నాయకులు తదితరులు పాల్గొన్నారు

## ప్రమాదవశాత్తు విద్యుత్ షార్ట్ సర్క్యూట్

### 50 ఎకరాలకు పైగా గడ్డివాము దగ్ధం

మానకొండూర్, ప్రభాతవార్త:



మానకొండూరు మండలంలోని వెల్ది గ్రామంలోని పల్లె ప్రకృతి వనం వద్ద ప్రమాదవశత్తు విద్యుత్ విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగి సుమారుగా 50 ఎకరాలకు పైగా గడ్డివాములు దగ్ధమైనట్లు బుధవారం రైతులు తెలిపారు. నర్సరీ కేంద్రం వద్ద విద్యుత్ స్తంభానికి లూస్ లైన్ ఉండడంతో ప్రమాదవశాత్తు షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగి మడికంటి శ్రీనివాస్ రెండెకరాలలో గడ్డి కట్టలు, మడి కంటి మల్లయ్య 30 కొబ్బరి చెట్లు పూర్తిగా దగ్ధమైనట్లు రైతులు ఆరోపించారు. మంటలను ఆర్పేందుకు రైతులు కష్టాలు పడ్డారు. దీంతో మంటలు ఆగిపోవడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు.

## మట్టిలో మాణిక్యం శివానికి ఘన సత్కారం

### మాజీ ఎమ్మెల్యే సుంకే రవిశంకర్

గంగాధర,ప్రభాత వార్త:

గంగాధర మండలం న్యాలకొండపల్లి గ్రామానికి చెందిన బోడపట్ల శివాని నార్సెట్‌లో ఆల్ ఇండియా స్థాయిలో 249వ ర్యాంకు సాధించి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగానికి ఎంపిక కావడం పట్ల చొప్పదండి మాజీ శాసన సభ్యులు సుంకే రవిశంకర్ హర్షం వ్యక్తం చేశారు.గ్రామీణ ప్రాంతానికి చెందిన నిరుపేద కుటుంబం నుంచి వచ్చి కష్టపడి చదివి ఈ స్థాయి విజయాన్ని అందుకోవడం అభినందనీయమని పేర్కొన్నారు. శివాని నికి మాజీ ఎమ్మెల్యే సుంకే రవిశంకర్ శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా సుంకే రవిశంకర్ మాట్లాడుతూ.. గ్రామీణ యువతలో అపార ప్రతిభ దాగి ఉందని, సరైన లక్ష్యం మరియు పట్టుదల ఉంటే ఉన్నత స్థానాలను అందుకోవచ్చని అన్నారు. శివాని సాధించిన విజయం గంగాధర మండలం, చొప్పదండి నియోజకవర్గానికి గర్వకారణమని పేర్కొన్నారు.శివాని భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తూ కుటుంబ సభ్యులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.



## మంత్రి అడ్లూరికి తృటిలో తప్పిన ప్రమాదం

కరీంనగర్ టౌన్,ప్రభాతవార్త:



కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో గొల్లపల్లి మండలానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్తని పరామర్శించి లిఫ్ట్‌లో కిందికి వెళ్తుండగా రెండో ఫ్లోర్ నుండి నియంత్రణ కోల్పోయిన లిఫ్ట్ గ్రౌండ్ ఫ్లోరికి వెళ్ళినట్లు సమాచారం.వేగంగా వచ్చి గ్రౌండ్ ఫ్లోర్ కు లిఫ్ట్ తాకడంతో కుదుపునకు గురైనట్లు తెలుస్తోంది..ఈ ఘటనలో మంత్రికి ఎలాంటి ప్రమాదం జరగలేదని తెలుస్తోంది.పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు.

## విత్తనాలు అందుబాటులో ఉంచాలని ఏడిఎకి వినతి

మెట్‌పల్లి,ప్రభాతవార్త:



రైతులకు జనుము,జిలుగు విత్తనాలు అందుబాటులో ఉంచాలని మెటుపల్లి వ్యవసాయ శాఖ ఏడిఏ దండ రమేష్ కు రైతులు బుధవారం పట్టణంలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో వినతిపత్రం అందచేశారు. ఖరీఫ్ సీజన్ పంటలకు సకాలంలో విత్తనాలను అందుబాటు లో ఉంచాలని కోరడం జరిగింది.ఈకార్యక్రమంలో రైతులు మారు మురళిధర్ రెడ్డి,జగదీశ్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## అత్యవసర సమయంలో రక్తదానం

మెట్ పల్లి డివిజన్, ప్రభాతవార్త:



మెట్‌పల్లి ప్రాంతానికి చెందిన సామాజిక సేవకుడు, తెలంగాణ రాష్ట్ర వంజరి సంఘం యూత్ వైస్ చైర్మన్ ,లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బొమ్మెల శివ అత్యవసర సమయంలో రక్తదానం చేసి మానవత్వాన్ని చాటుకున్నారు.పద్మాక్షి హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న వెంకట్రావుపేటకు చెందిన మాధురికి బుధవారం ఓ పాజిటివ్ రక్తం అవసరమవడంతో వెంటనే స్పందించిన శివ బ్లడ్ బ్యాంక్‌కు వెళ్లి 21వ సారి రక్తదానం చేశారు.శివ సేవలను బ్లడ్ బ్యాంక్ సిబ్బంది, ఉదయ్ కుమార్, వంజరి సంఘం సభ్యులు అభినందించారు.

# నేరాలు-దారుణాలు

## భార్య మృతి తట్టుకోలేక సింగరేణి రిటైర్డ్ కార్మికుడు ఉరివేసుకొని ఆత్మహత్య

రామగిరి ప్రభాతవార్త:

రామగిరి మండలం పన్నూరు గ్రామపంచాయతీ పరిధిలోని శివరాం నగర్ కు చెందిన మైలారం చంద్రయ్య( 68) సంవత్సరాలు అనే సింగరేణి రిటైర్డ్ కార్మికుడు భార్య మృతి తట్టుకోలేక బుధవారం ఉరివేసుకొని ఆత్మహత్య పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు స్థానిక పోలీసులు ఇచ్చిన సమాచారం మేరకు మృతుడు సింగరేణి ఓ సి పి 2 లో ఉద్యోగం చేసి ఎనిమిది సంవత్సరాల క్రితం రిటైర్డ్ అయి ఇంటి వద్ద ఉంటున్నాడు. మృతునికి ఇద్దరు కుమారులు ముగ్గురు కుమార్తెలు కాగా వారు వేరువేరు ప్రాంతాల్లో నివాసం ఉంటున్నారు. ఇటీవల భార్య లక్షి ్మ అనారోగ్యంతో మృతి చెందింది. భార్య మృతి తట్టుకోలేక మనస్థాపంతో బాత్రూంలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇది గమనించిన చుట్టుపక్కల వారు కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా వారు వచ్చి చూసే సరికి మృతి చెంది ఉన్నాడు. ఈ మేరకు మృతుని కుమారుడు శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రామగిరి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## ఉరి వేసుకొని వృద్ధుడు మృతి

ముస్తాబాద్ ప్రభాత వార్త:



ఉరి వేసుకుని వృద్ధుడు మృతి చెందిన సంఘటన ముస్తాబాద్ మండలం చికోడ్ గ్రామములో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చికోడ్ గ్రామానికి చెందిన బొమ్మేన నర్సయ్య ఒంటరితనంతో జీవితంపై విరక్తి చెంది బుధవారం చెట్టుకు ఉరి వేసుకుని మృతి చెందినాడని ముస్తాబాథ్ ఎస్సై గణేష్ తెలిపారు.

## గడ్డివాము దగ్ధం

### -ఫైర్ ఇంజన్ రాకతో తప్పిన పెను ప్రమాదం

రామగిరి ప్రభాతవార్త:



రామగిరి మండలం పన్నూరు గ్రామానికి చెందిన రైతు ఉడుత లచ్చయ్య గడ్డివాము బుధవారం మంటలు వ్యాప్తి చెంది పూర్తిగా దగ్ధమైంది. రైతు లచ్చయ్య రెండు ఎకరాల గడ్డి పశువుల కోసం తన ఇంటి సమీపంలో నిల్వ ఉంచాడు.అనుకోకుండా గడ్డివాముకు మంటలు వ్యాపించడంతో స్థానికులు గమనించి ఫైర్ ఇంజన్ సమాచారం అందించారు. ఫైర్ ఇంజన్ సహాయంతో గడ్డివాము చుట్టుపక్కల మంటలు వ్యాప్తి చెందకుండా ఆర్పేయడంతో పెను ప్రమాదం తప్పింది. అప్పటికే మంటలు గడ్డి వాముకు వ్యాపించి పూర్తిగా దగ్ధమైంది. తన పశువుల కోసం తెచ్చుకున్న గడ్డివాము దగ్ధం కావడంతో రైతు ఆందోళన చెందుతున్నాడు. ప్రభుత్వ పరంగా బాధిత రైతును ఆదుకోవాలని స్థానిక నాయకులు గ్రామస్తులు కోరుతున్నారు.

## మట్టి తరలింపు అడ్డుకున్న రెవిన్యూ అధికారులు

కాల్వశ్రీరాంపూర్-ప్రభాతవార్త:

మండలంలోని ఎదులాపూర్ గ్రామ శివారులో అక్రమంగా మట్టిని పెద్దపల్లికి తరలిస్తుండగా బుధవారం స్థానిక తాసిల్దార్ రా పెల్లి రాముడు తో పాటు రెవిన్యూ సిబ్బంది మట్టి తరలింపును అడ్డుకున్నారు. ఎక్స్ వేటర్ పోలీస్ స్టేషన్ కు తరలించినట్లు తాసిల్దార్ తెలిపారు . ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తాసిల్దార్ తెలిపారు.



కోరుట్ల వార్త

# కోరుట్ల నియోజక స్థాయి ప్రజా పాల ప్రగతి ప్రణాళిక విద్య వారోత్సవాలు

**కోరుట్ల టౌన్, ప్రభాతవార్త :**

కోరుట్ల నియోజక స్థాయి ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక విద్యావారోత్సవాలు ఈ రోజు కోరుట్ల పట్టణంలోని సీఎమ్ఎస్ పంక్షన్ హాలు బుధవారం జరిగింది. ఈ వారోత్సవాల్లో కోరుట్ల, మెట్ పల్లి, ఇబ్రహీంపట్నం మల్లాపూర్, మేడిపల్లి, భీమారం, కథలపూర్ సర్పంచ్ లు, మునిసిపల్ కౌన్సిలర్లులు పాల్గొనగా, కోరుట్ల మునిసిపల్ చైర్మన్ తిరుమల వసంత గంగాధర్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరు అగునట్లు,డ్రాప్ అవుట్ లను తగ్గించి విద్యా వికాసానికి కృషి చేయాలని,చదువుతోపాటు విద్యార్థుల్లో విలువలు, క్రమశిక్షణ పెంపొందే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని, ప్రభుత్వ



పాఠశాలల అభివృద్ధికి ఉపాధ్యాయులు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల మునిసిపల్ వైస్ చైర్మన్ షాహిద్, మెట్ పల్లి మునిసిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి, వైస్ చైర్మన్ నవీన్ ,మండల పరిషత్ అభివృద్ధికారులు కోరుట్ల రామకృష్ణ, మెట్ పల్లి సురేష్, మల్లాపూర్ శ్రీకాంత్, ఇబ్రహీంపట్నం గణేష్, కథలపూర్ శంకర్ నాయక్, మేడిపల్లి అంజుమా, భీమారం నీరజ లు, మండల విద్యాధికారులు, మెట్ పల్లి మండల విద్యాధికారి కనక తార, మల్లాపూర్ దామోదర్ రెడ్డి, ఇబ్రహీంపట్నం మధు, కథలపూర్ లోకిని శ్రీనివాస్, మేడిపల్లి లక్ష్మినర్సయ్య, భీమారం మధుసూదన్ రెడ్డి, ఎపీసీ చైర్మన్లు అంజమ్మ, పద్మ, రాధిక, శ్యామల, లావణ్య, లత, సరోజ లు సర్పంచ్ లు, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, సిఆర్పిలు, ఎంఆర్సి సిబ్బంది పాల్గొన్నారు.

## ఇంటర్ పరీక్ష రాసిన మాజీ మావోయిస్టు తిరుపతి

**కోరుట్ల, ప్రభాతవార్త :**



విప్లవ ఉద్యమం నుంచిజనజీవనంలో తిరిగి అడుగుపెట్టిన తిప్పిరి తిరుపతి నాలుగు దశాబ్దాల తర్వాత ఇంటర్మీడియట్ పరీక్షను బుధవారం రాశాడు. 198485 విద్యా సంవత్సరంలో కోరుట్ల జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుతున్న సమయంలో ఆయన విప్లవ భావజాలానికి ఆకర్షితులై పరీక్షను బైకట్ చేశాడు. గతంలో అన్ని సబ్జెక్టుల్లో ఉత్తీర్ణత సాధించినప్పటికీ తెలుగు సెకండియర్ పరీక్ష మాత్రం పూర్తి చేయలేకపోయారు.ఇటీవల మావోయిస్టు ఉద్యమాన్ని వీడి సాధారణ జీవనంలోకి వచ్చిన దేవ్ జీ, అసంపూర్తిగా మిగిలిన విద్యను పూర్తి చేయాలనే సంకల్పంతో ఇంటర్ బోర్డు నుంచి ప్రత్యేక అనుమతి పొంది, బుధవారం స్థానిక మాస్ట్రో జూనియర్ కళాశాలలో ఎగ్జామ్ రాశాడు. ఇదిలా ఉండగా ఇంటర్ పూర్తి చేసిన తర్వాత న్యాయ విద్య అభ్యసించి పేదలకు న్యాయ సహాయం అందిస్తానని తిరుపతి వెల్లడించారు.

## ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం

**మేడిపల్లి, ప్రభాతవార్త :**



మండల కేంద్రానికి చెందిన కేతవేణ్ణి జ్యోతి - మహేష్ దంపతులు నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశం బుధవారం నిర్వహించారు. ఇందిరమ్మ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ప్రజ ప్రభుత్వం ద్వారా పేద ప్రజల సొంతింటి కలను నిజం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇల్లు పథకం ద్వారా అనేక కుటుంబాలు గృహ స్వప్నాన్ని సాకారం చేసుకుంటున్నాయన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి కుటుంబం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్బంగా లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, వారికి నూతన వస్త్రాలను అందజేశారు.లబ్ధి దారులు తమకు కేటాయించిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సహకరించిన వేములవాడ నియోజకవర్గ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనన్న కు ఇందిరమ్మ కమిటీ సభ్యులకు, పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు చేపూరి నాగరాజు, బలగం సునీత, రాజేష్, దాసరి శంకర్, తోట రాజేందర్, మ్యాకల రాజు, కేతవీణి పెద్ద నర్సయ్య, చిన్న నర్సయ్య, మొరపెల్లి నర్సయ్య, నరేష్ తది తరులు పాల్గొన్నారు

## మోడల్ స్కూల్లో ఇంటర్ ప్రవ్నేశ కు నోటిఫికేషన్

**మల్యాల /ప్రభాతవార్త**

మోడల్ స్కూల్లో202627 ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు నోటిఫికేషన్ జారీ అయినట్లు మల్యాల మండలం నూకపల్లి మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ గుమ్మడి ఆదిత్య తెలిపారు,ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు ఈనెల 13 నుండి 25 వరకు ఆన్లైన్ లో దరఖాస్తు చేసుకోవాలని,26 న విద్యార్థులు దరఖాస్తు చేసుకున్న ఆయా పాఠశాలలకు జాబితా తయారు, 27 న విద్యార్థుల మెరిట్/ రిజర్వేషన్ వారిగా ఎంపిక, 28 నుండి మే 30 వరకు ఎంపిక కాబడిన విద్యార్థుల సర్టిఫికెట్ల పరిశీలన, జూన్ 1 నుండి తరగతుల ప్రారంభం జరుగుతుందని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ వివరించారు, టెన్త్ లో పాస్ అయిన ఆసక్తిగల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు,

## మరో కుంభమేళను తలపించిన కొండగట్టులో హనుమాన్ జయంతి

### కొండగట్టులో ముగిసిన జయంతి వేడుకలు

### దీక్ష మండపం నుండి గర్భగుడిలోకి ఉత్సవ మూర్తుల తరలింపు

**మల్యాల /ప్రభాతవార్త**



తెలంగాణలో ప్రసిద్ధిగాంచిన కొండగట్టు అంజన్న క్షేత్రంలో ఆదివారం నుండి ప్రారంభమైన పెద్ద హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి, మూడు రోజులపాటు జరిగిన జయంతోత్సవానికి సుమారు రెండు లక్షల పైగానే భక్తులు స్వామివారిని దర్శించుకుని తమ మాల విరమణ చేసుకున్నారు, కొండగట్టు లోజయంతి కి ఉత్సవాలకు వేలాదిగా తరలి భక్తుల తో మరో కుంభమేళాను తలపించాయి,దీంతో ఆలయ పరిసరాలన్నీ కాషాయ వర్ణం కాగా, జై శ్రీరామ్ ,జై హనుమాన్ నామస్మరణతో హోరెత్తాయి,జయంతి ముగింపు సందర్భంగా స్వామివారి ఆలయ ఆవరణలో శ్రీరామ,, జయ రామ,, ఓం,, ఆకారంలో దీపాలంకరణ చేశారు, ఇదిలా ఉండగా ఉత్సవాలు ముగియడంతో బుధవారం మాల విరమణ మండపం నుండి శ్రీస్వామివారి ఉత్సవ మూర్తులను అర్చకుల వేద పండితుల ఆధ్వర్యంలో వేదమంత్రోత్సవాల మధ్య మంగళ వాయిద్యాలతో ఆలయ గర్భర గుడిలోకి ప్రవేశింప చేశారు, కార్యక్రమంలో ఆలయ ఈవో అంజన రెడ్డి, ఆలయ ప్రధాన అర్చకులు రాజు ఉప ప్రధానార్చకులు చిరంజీవి, చిన్న రాము, జితేందర్ శ్రీకాంత్ , ఆలయ ఏఈవో హరిహరనాథ్ సూపరిండెంట్లు సునీల్, చంద్రశేఖర్ పాల్గొన్నారు,

**జయంతి ఉత్సవాలు సక్సెస్:: ఆలయ ఈవో అంజనారెడ్డి**

ఈనెల 10 నుండి 12 వరకు జరిగిన పెద్ద హనుమాన్ జయంతి ఉత్సవాలు వివిధ శాఖల అధికారులు పోలీసుల కట్టుదిట్టమైన ఏర్పాట్లతో, సమన్వయంతో శ్రీ స్వామివారి ఉత్సవాలను వైభవంగా నిర్వహించామని అధికారులు ఎప్పటికప్పుడు ఏర్పాట్లను జరిపి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉత్సవాలను విజయవంతం చేసినట్లు, ఇ న్న దుకు సహకరించిన వివిధ శాఖల అధికారులు, సిబ్బంది కి కొండగట్టు ఆలయ ఈవో అంజనారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు,

## కేడీసీసీ బ్యాంకులో భీమా

### లబ్ధి పొందిన కొమురయ్య

**చొప్పదండి,ప్రభాతవార్త:**

మండల పరిధిలో ని ఆర్నకొండ గ్రామానికి చెందిన గంట కొమురయ్య గత నవంబర్ నెలలో కేడీసీసీ బ్యాంకు చొప్పదండి శాఖ ద్వారా 10 లక్షల రుణాన్ని తీసుకున్నారు. రుణం తీసుకున్న సమయంలో ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన పథకం కింద కేవలం 436 రూపాయలు చెల్లించి బీమా చేయించుకున్నారు. ఇటీవల అనారోగ్య కారణాలతో కొమురయ్య మరణించగా బీమా పథకం ద్వారా రెండు లక్షల బీమా మంజూర అయింది. మంజూరైన రెండు లక్షల రూపాయల చెక్కును బుధవారం ఆర్నకొండలో కొమురయ్య ఇంటికి వెళ్లి వారి కుటుంబ సభ్యులకు కేడీసీసీ బ్యాంకు ఏజీఎం నాగరాజు, మేనేజర్ మనోజ్ కుమార్, ఫీల్డ్ ఆఫీసర్ శ్రీకాంత్, అసిస్టెంట్ మేనేజర్ రాకేష్, సిబ్బంది అందజేశారు.



## డ్రైనేజీ నిర్మాణానికి భూమి పూజ

### మున్సిపల్ చైర్ పర్సన్ తిరుమల వసంత గంగాధర్

**కోరుట్ల, ప్రభాతవార్త :**



కోరుట్ల పట్టణంలోని 22వ వార్డులో డ్రైనేజీ సమస్యతో ప్రజలు ఇబ్బంది పడుతున్న విషయాన్ని స్థానిక కౌన్సిలర్ టేకుల శిరీష నరేష్ లు మున్సిపల్ చైర్ పర్సన్ తిరుమల వసంత గంగాధర్ దృష్టికి తీసుకెళ్లగా మున్సిపల్ చైర్ పర్సన్ తిరుమల వసంత గంగాధర్ వైస్ చైర్మన్ స్థానిక వార్డ్ కౌన్సిలర్ టేకుల శిరీష నరేష్ లతో కలిసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా చైర్పర్సన్ తిరుమల వసంత గంగాధర్ మాట్లాడుతూ ప్రజాసమస్యల అభివృద్ధి సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తుందని ప్రజలకు ఏ ఇబ్బంది ఉన్న తమ దృష్టికి తీసుకువస్తే సమస్య పరిష్కారానికి తప్పకుండా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షాహిద్, స్థానిక వార్డు కౌన్సిలర్ టేకుల శిరీష నరేష్ వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు

## కోట బురుజుల పరిరక్షణకు సహకరించాలి

**కోరుట్ల, ప్రభాతవార్త :**

చాళుక్య జైనుల కాలం నాటి సంపద పురాతన కోట బురుజులు కోనేరు వాటి స్థలాలు రక్షించాలని గత కొన్ని సంవత్సరాలుగా కోరుట్ల అఖిలపక్ష ప్రజాసంఘాల నాయకులు అనేక రకాలుగా దశల వారి ఉద్యమాలు చేస్తున్న నేపథ్యంలో కోరుట్ల ప్రజలు సౌమ్యులని కోటి బురుజులు కాపాడుకోవడంలో ముందూ వరుసలో ఉన్నారని తెలంగాణ ప్రజాసంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పేట భాస్కర్ అన్నారు.అభివృద్ధి కి అమాడ దూరంగా వున్న వాటిని ఇన్నేళ్లుగా అక్రమంగా అమ్ముకోవాలని ఎవరు చూడలేదని, కానీ ఈమధ్య దురాశ పుట్టిన కొందరి నాయకుల ప్రోద్బలంతో నకిలీ దస్తావేజులతో పేరు మార్చడమే కాకుండా దాదాపు 80 లక్షల వరకు లంచాలు తీసుకుని 5800 గజాలకు విఎల్టీ వేసిన కమీషనర్ ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ నిరసన దీక్షలు, రాస్తారోకో చేపట్టిన విషయం కోరుట్ల ప్రజలకు విధితమేనన్నారు. మున్సిపల్ కౌన్సిల్ లో విఎల్టీలను రద్దు చేయాలని సంతకాల సేకరణకు అఖిలపక్ష ప్రజాసంఘాల నాయకులు నడుము బిగించగా బిజేపి, బిఆర్ఎస్ కౌన్సిలర్లు సంపూర్ణ మద్దతు ప్రకటించి సంతకాలు చేశారు. మిగిలిన అధికార కాంగ్రెస్ పార్టీ సైతం ప్రజా ఉద్యమాలను, సంతకాల సేకరణను గౌరవించి సోమవారం నాటి నుండి కాంగ్రెస్ కౌన్సిలర్ లు సంతకాలు చేస్తుండగా మాజీ మున్సిపల్ చైర్మన్ గడ్డమీది పవన్ , పుప్పాల ఉమాదేవి ప్రభాకర్, రిజ్వాన్ పాషా, మేడిపల్లి శిరీష్ శేఖర్ తో పాటు మిగతా కౌన్సిలర్లు కూడా సంతకాలు చేస్తునన్నారు. ఇక మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో అధికార పక్షం అండతో ఆ విఎల్టీలను రద్దు చేయడమే తరువాయి మిగిలిందన్నారు. ప్రజాసంఘాల జేఏసీ అధ్యక్షుడు డాక్టర్ పేట భాస్కర్, అఖిలపక్ష కన్వీనర్ ఎండి ముజాహిద్ లు మాట్లాడుతూ గడి స్థలాలు కాపాడుకోవడం కోరుట్ల గడ్డ బిడ్డలుగా మన బాధ్యత అని అ స్థలాల్లోని విఎల్టీలను రద్దు చేసి ప్రజా ప్రయోజనాల దృష్ట్యా కూరగాయల మార్కెట్, ఆహ్లాదకరమైన పార్కు, మైసమ్మ దేవాలయంతో పాటు దసరా పండుగ మహిషాసుర మర్దనా ఉత్సాహాలు యదావిధిగా అక్కడే కొనసాగించేలా అన్ని పార్టీల ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు సహకరించాలని కోరారు. అఖిలపక్ష ప్రజాసంఘాల నాయకులు చెన్న విశ్వనాథం, తుమ్మనపల్ల శ్రీనివాస్ బాబు, షాహేద్ మహ్మద్ షేక్, సుతారి రాములు, చింతా భూమేశ్వర్,శంకర్, సత్యం తదితరులు పాల్గొన్నారు

## బిజెపి పార్టీ సిద్ధాంతం కోసం కార్యకర్తలు కలిసి పని చేయాలి

### : బీజేపీ పట్టణ అధ్యక్షుడు దొనికెల నవీన్



**మెట్ పల్లి డివిజన్, ప్రభాతవార్త:** మెట్‌పల్లి పట్టణంలోని మాసం సత్తయ్య ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన బీజేపీ పట్టణ శాఖ కమిటీ ఎన్నికల సన్నాహక సమావేశం బీజేపీ పట్టణ అధ్యక్షుడు దొనికెల నవీన్ అధ్యక్షతన బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశం కోసం, ధర్మం కోసం, పార్టీ సిద్ధాంతం కోసం కార్యకర్తలు పార్టీ జెండా కింద ఐక్యంగా పని చేయాలని పిలుపునిచ్చారు. బూత్ స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా నూతన కమిటీలను ఏర్పాటు చేసుకుందామన్నారు. ఎంపీ ధర్మపురి అరవింద్ నాయకత్వంలో అందరూ సమన్వయంతో పనిచేస్తూ పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. స్థానిక వార్డుల్లో ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ కార్యకర్తలు ప్రజాసేవలో ముందుండాలని తెలిపారు. ఎంపీ అరవింద్ ధర్మదీక్షకు తరలిరావాలి: ఈనెల 18వ తేదీన జగిత్యాల కేంద్రంలో నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ నిర్వహించ నున్న "ధర్మదీక్ష" కార్యక్రమానికి కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావాలని బిజెపి పట్టణ అధ్యక్షుడు ధోనికేల నవీన్ పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం నవోదయ విశ్వవిద్యాలయం మంజూరు చేసినప్పటికీ స్థానిక కాంగ్రెస్ ఎమ్మెల్యేలు భూమి కేటాయింపులో నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపిస్తూ ఎంపీ అరవింద్ ఈ దీక్ష చేపడుతున్నట్లు తెలిపారు.

# మెట్‌పల్లి వార్త

## ఉత్తమ విద్యార్థులకు ఘన సన్మానం

మెట్ పల్లి డివిజన్, ప్రభాతవార్త:



మెట్‌పల్లి పట్టణంలోని 25వ వార్డులో గల జెడ్పీహెచ్ఎస్ న్యూ పాఠశాలలో బుధవారం ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ఘనంగా సన్మానించారు. పాఠశాలలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులలో మొదటి స్థానం సాధించిన ఇబ్రహీం 529 మార్కులు, రెండవ స్థానం సాధించిన రాకేష్ 511 మార్కులు పొందగా, వారికి 25వ వార్డు కౌన్సిలర్ అస్ర ఫర్హీన్ జావిద్ అభినందనలు తెలియజేసి సన్మానించారు. అదేవిధంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఏనుగంటి నరసయ్య ఉత్తమ పేరెంట్‌గా ఉస్మాన్ ని సన్మానించారు. అలాగే పాఠశాలలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు బహుమతులు అందజేసి ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఏనుగంటి నరసయ్య, ఉపాధ్యాయులు భూమేశ్వర్, నంబి రాజేంద్ర శర్మ, విజయ్ కుమార్, మనోజ్ కుమార్, బండి సుధాకర్, వాసాల శేషు, పాల్గొన్నారు.

## పట్టణంలో వీధి కుక్కల బెడదపై ప్రత్యేక చర్యలు

### మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి



**మెట్ పల్లి డివిజన్, ప్రభాతవార్త:** మెట్‌పల్లి పట్టణంలో పెరుగుతున్న వీధి కుక్కల బెడదపై మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి ప్రత్యేక దృష్టి సారించారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని మున్సిపాలిటీ ఆధ్వర్యంలో వీధి కుక్కల నివారణ చర్యలను చేపట్టారు. పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో సంచరిస్తున్న కుక్కలను పట్టుకుని యానిమల్ షెల్టర్‌కు తరలించారు. ఈ సందర్భంగా చైర్మన్ మైలారపు లింబాద్రి మాట్లాడుతూ, పట్టణ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా మున్సిపాలిటీ తరఫున అవసరమైన చర్యలు నిరంతరం కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ ఓంకార్ నవీన్, కాంగ్రెస్ నాయకులు మైలారపు రాంబాబు కౌన్సిలర్లు కాజా అజీమ్, నునుగొండ నరేష్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సేవే లక్ష్యంగా పనిచేస్తా

### కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్.



**మెట్‌పల్లి,ప్రభాతవార్త:** నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ, ప్రజా సేవే లక్ష్యంగా పని చేస్తానని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పలువురికి వైద్య చికిత్సల నిమిత్తం ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ బుధవారం ఎల్వోసీలు అందచేశారు. ఇందులో భాగంగా కోరుట్ల మండలం అయిలాపూర్ గ్రామానికి చెందిన వెల్మ విజయ కు రూ.75,000/ విలువైన ఎల్వోసీ,మెటుపల్లి మండలం వెల్లుల్ల గ్రామానికి చెందిన జాప అశోక్ కి రూ.1,00,000/ విలువైన ఎల్వోసీ,మల్లాపూర్ మండలం ముత్యంపేటకు చెందిన సుద్దాల రాజు కి రూ.75,000/ విలువైన ఎల్వోసీ,మొగిలిపేట గ్రామానికి చెందిన ముక్కెర రాకేష్ కు రూ.1,00,000/ విలువైన ఎల్వోసీని ఎమ్మెల్యే బుధవారం అందజేశారు. ఈకార్యక్రమ లో మాజీ ఎంపీపీ మారు సాయిరెడ్డి,నాయకులు ఎలాల దశరత్ రెడ్డి,పీసు తిరుపతి రెడ్డి,పాల్గొన్నారు.

## అనుమతి లేని లేఅవుట్లపై చర్యలు

### మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ గౌడ్



**మెట్ పల్లి డివిజన్, ప్రభాతవార్త:** మెట్‌పల్లి పట్టణంలోని పెద్దమ్మ టెంపుల్ సమీపంలో అనధికారికంగా ఏర్పాటు చేసిన లేఅవుట్‌పై మున్సిపల్ అధికారులు బుధవారం చర్యలు చేపట్టారు. అనధికార లేఅవుట్‌లో ఏర్పాటు చేసిన హద్దురాళ్లు, ఖనీలను మున్సిపల్ సిబ్బంది తొలగించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ డి. శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ... మున్సిపల్ అనుమతి లేకుండా లేఅవుట్లు లేదా ప్లాట్లు ఏర్పాటు చేయరాదని హెచ్చరించారు. అనుమతి లేని ప్లాట్లు కొనుగోలు చేసిన వారికి నిర్మాణ అనుమతులు, మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండవని తెలిపారు. ప్రజలు మున్సిపాలిటీ అనుమతి పొందిన లేఅవుట్‌లలో మాత్రమే ప్లాట్లు కొనుగోలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీపీఓ రాజేంద్రప్రసాద్, టీపిబిఓలు, టౌన్ ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఇరుకు రోడ్డుతో.. ఇబ్బందుల్లో ప్రజలు

### వెల్లుల్ల లో ప్రధాన రహదారి పై నిలిచిపోయిన వాహనాలు.



**మెట్‌పల్లి, ప్రభాతవార్త:** మండలంలోని వెల్లుల్ల మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో ఆత్మకూర్ వెళ్లే ప్రధాన రహదారి ఇరుకు గా మారడంతో బుధవారం సుమారు 40వాహనాలు రోడ్డుపై నిలిచి పోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురైనా..అధికారులు ప్రజా ప్రతినిధులు మాత్రం పట్టించుకోకపోవడం తీవ్ర విమర్శలకు తావిస్తుంది. వివరాల్లోకో వెళితే.. మెటుపల్లి నుండి ఆత్మకూరు వెళ్లే ప్రధాన ఆర్ బి రహదారి వెల్లుల్ల గ్రామంలో గత కొన్ని ఏళ్లుగా ఇరుకుగా ఉండి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నా.. సంబంధిత అధికారులు, ప్రభుత్వం మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ప్రస్తుతం వరి ధాన్యం తరలిస్తున్న లారీల రవాణా ఎక్కువగా ఉండటంతో ఈ రహదారి పై ట్రాఫిక్ అధికంగా మారిందని.. అధికారులు, ప్రజాప్రతినిధులు ఇకనైనా ఇట్టి రహదారి ఇబ్బందులు తీర్చాలని కోరుతున్నారు.

## న్యాయవాదుల ప్రేమాభిమానాలు వెలకట్టలేనివి

### సీనియర్ సివిల్ జడ్జి నాగేశ్వర్ రావు.

**మెట్ పల్లి కల్చరల్,ప్రభాత వార్త:**మెట్ పల్లి న్యాయవాదుల ప్రేమాభిమానాలు వెల కట్టలేనివని సీనియర్ సివిల్ జడ్జి డి. నాగేశ్వర్ రావు అన్నారు.మెట్ పల్లి కోర్టు నుండి జగిత్యాల కి నాగేశ్వర రావు బదిలీ అయిన సందర్భంగా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని కోర్టు ఆవరణలో బుధవారం వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మెటుపల్లి కోర్టులో పనిచేసిన 20 నెలల కాలంలో బార్ అసోసియేషన్ సభ్యులు చూపించిన అభిమానం, ఆప్యాయతలు జీవితకాలం మర్చిపోలేనివని,ఇక్కడి అనుబంధం మరికొంతకాలం కొనసాగడం కోసమే దేవుడు జగిత్యాల బదిలీ చేసాడేమోనని పేర్కొన్నారు. తన విధి నిర్వహణలో భాగంగా ఎవరినైనా నొప్పించి ఉంటే క్షమించాలని కోరారు. అనంతరం న్యాయవాదులు సీనియర్ సివిల్ జడ్జికి శాలువా కప్పి ఘనంగా సన్మానించి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమం లో జూనియర్ సివిల్ జడ్జి వి. మాధవి, సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ దయ్యా రాజారాం, మెట్ పల్లి, కోరుట్ల బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఏలేటి రామ్ రెడ్డి, తోట ఆంజనేయులు,ప్రధాన కార్యదర్శి నల్ల రాజేందర్, ఎపిపి లు చెర్లపల్లి ఆనంద్ గౌడ్, జి. ప్రణయ్, ఎజిపి అబ్దుల్ హఫీజ్, న్యాయవాదులు జిల్లా వెంకటేశ్వర్లు, వడ్డేపల్లి శ్రీనివాస్, కుమారం శ్రీనివాస్, గంద్ర ప్రవీణ్ రావు, కంతి మోహన్ రెడ్డి, బార్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.




## హనుమాన్ నగర్‌లో విద్యుత్ సమస్య పరిష్కారానికి వినతి

**మెట్పల్లి అర్బన్,ప్రభాతవార్త :** పట్టణంలోని హనుమాన్ నగర్ ఆరవ వీధిలో లో వోల్టేజ్ సమస్య తీవ్రంగా ఉందని,సమస్యను పరిష్కరించాలని సి జి ఆర్ ఎఫ్ చైర్మన్ సలంద్ర రామకృష్ణ ,డీ ఈ మధుసూదన్ లకు బుధవారం వినతి పత్రం అందజేశారు. అనంతరం కాలనీ వాసులు మాట్లాడుతూ..గతంలో ఆరో వీధిలో ఉన్న ట్రాన్స్ఫార్మర్ను వేరే చోటుకు అమర్చగా అప్పటినుండి లో వోల్టేజ్ సమస్య ఏర్పడుతుందని అందువలన ఎలక్ట్రానిక్ పరికరాలు ఏసి, ఫ్రిడ్జ్, కూలర్లు,ఫ్యాన్లు, లో వోల్టేజ్ కి తట్టుకోలేక పాడవడం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇట్టి సమస్యను తక్షణమే పరిష్కరించాలని కోరారు. ఈ సమావేశంలో గంగుల నందు, ధర్మపురి వేణుగోపాల్, నడికట్ల గంగాధర్,పడిగెల నరేష్, నాగరాజ్, వేణు తదితరులు పాల్గొన్నారు.

సిరిసిల్ల వార్త

# ధాన్యం తూకం వేగవంతం చేయాలి

ఇల్లంతకుంట, ప్రభాతవార్త

మండలంలోని రైతుల వరి ధాన్యం తూకం వేగవంతం చేయాలనీ జడ్పీ మాజీ వైస్ చైర్మన్ వేణు అన్నారు. మండల కేంద్రములో బుధవారం ఆయన మాట్లాడుతూ వరి,పొద్దుతిరుగుడు, మొక్కజొన్నలు వెంట వెంటనే కొనుగోలు చేసి తరలించాలని డిమాండ్ చేశారు. రోజుకో గ్రామములో రైతులు ధర్నాలు చేస్తున్నా స్థానిక ఎమ్మెల్యే, అధికారులకు చలనం లేదన్నారు.ప్రతి కొనుగోలు కేంద్రానికి రెండు లారీలు పంపించి కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో రైతు సమన్వయ సమితి మాజీ మండల



అధ్యక్షుడు చెరుకుపెల్లి రాజిరెడ్డి, ఉపసర్పంచుల ఫోరమ్ మండల మాజీ అధ్యక్షుడు ఎండి.సాదుల్,ఏఎంసి మాజీ వైస్ చైర్మన్ ఎంఢ్ర చందన్,రవిందర్ రెడ్డి, భాస్కర్ రెడ్డి,ఇంద్రసేనారెడ్డి, తోట తిరుపతి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లు

## కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్

సిరిసిల్ల టౌన్, ప్రభాతవార్త :

అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లు ప్రభుత్వం అందజేస్తుందని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని పలు వార్డులలోని ఇందిరమ్మ ఇండ్లను కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్ బుధవారం ప్రారంభించారు. అనంతరం ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు నూతన వస్త్రాలను అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అమలు చేస్తున్న పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రంధాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ,పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్ , మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్



ఆడెపు చంద్రకళ , బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సూర దేవరాజు, 14వ వార్డు కౌన్సిలర్ వెంగళ లీల, సూర నిర్మల , వెంగళ లక్ష్మీనరసు,ఎల్లయ్య , బాలరాజు, తడక వెంకటేశం, సత్యనారాయణ, లచ్చయ్య, కోలకని రాజేశం, ఆడెపు ప్రసాద్, సదుల గంగాధర్, కోలకాని ఎల్లయ్య, ఎర్ర నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ తమ ఇంటి వివరాలు విధిగా అందించాలి

## తహసిల్దార్ మారుతి రెడ్డి

గంభీరావుపేట-ప్రభాతవార్త:



జన గణనపై ప్రజలకు అవగాహ ప్రతి ఒక్కరూ తమ ఇంటి వివరాలను విధిగా అందించాలని తహసిల్దార్ మారుతి రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారము కేంద్ర ప్రభుత్వం చేపట్టిన జనగణలలో భాగంగా గంభీరావుపేట మండల కేంద్రంతో పాటు, మండలంలోని పలు గ్రామాలలో తహసిల్దార్ అధ్యక్షతన జనగణ పై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం చేపట్టిన జన గణన లో భాగంగా ఈనెల 11 నుండి ఇంటింటి గణన ప్రారంభించడం జరిగిందని తెలిపారు. మండలంలోని ప్రతి ఒక్కరు తమ ఇంటి వివరాలతో పాటు కుటుంబ వివరాలను ఇంటింటికి వచ్చే ఎనిమరేటర్ లకు వివరాలందించి సహకరించాలని కోరారు. ప్రతి ఒక్కరూ జనగణను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమం పై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజేందర్, ఆర్ ఐ ప్రశాంత్, సూపర్వైజర్లు ఏ సుజాత, ఎన్ లత, కంప్యూటర్ ఆపరేటర్ దేవరాజులతో పాటు ఎన్యూమరేటర్స్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యా వారోత్సవాలు

గంభీరావుపేట, ప్రభాతవార్త:



గంభీరావుపేట మండల కేంద్రంలోని డిగ్రీ మరియు పీజీ ప్రభుత్వ కళాశాలలో ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా బుధవారము విద్యా వారోత్సవాలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ విజయలక్ష్మి అధ్యక్షత నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా నాస్కాప్ చైర్మన్ కొండూరు రవీందర్రావు, జిల్లా బిఆర్ఎస్ అధ్యక్షులు తోట ఆగయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాస్కాబ్ చైర్మన్ మాట్లాడుతూ కళాశాల స్థాపించిన మొదటి నుండి నేటి వరకు కళాశాల అభివృద్ధికి ఎన్నో నిధులు కేటాయించి అభివృద్ధి పరచడంలో సహాయ సహకారాలు అందించినట్లు తెలిపారు. కేజీ టు పీజీ కళాశాలకు హాస్టల్ వసతి లేక విద్యార్థుల సంఖ్య పెరగడానికి అడ్డంకిగా మారిందని ప్రిన్సిపాల్ ఈ సందర్భంగా గుర్తు చేశారు. పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ కాలేజీ ప్రారంభంలో ఎటువంటి వసతులు లేక అసౌకర్యమైన పరిస్థితిని ఎదుర్కొన్నామని ప్రస్తుతం కళాశాలలో సకల సౌకర్యాలు అందుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎం ప్రభాకర్ లతోపాటు అధ్యాపకులు అధ్యాపకేతర బృందం విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# వృద్ధ దంపతులకు అధికారుల న్యాయం

ఇల్లంతకుంట, ప్రభాతవార్త



కన్న వారున్న తల్లి దండ్రులపై కనికరించని కుమా రుల నుండి వృద్ధ దంపతులకు జిల్లా అది కారులు న్యాయం చేశారు. వివరాల ప్రకారం మండలములోని ముస్కా నిపేట గ్రామానికి చెందిన సామ చొక్కారెడ్డి దంపతు లకు సామ రాజేశ్వర్ రెడ్డి,సామ నర్సింహా రెడ్డి ఇద్దరు కుమారులున్నారు.చిన్న కుమారుడు అదే గ్రామంలో దత్తత వెళ్లగా, పెద్ద కుమారుడు అనారోగ్యం కారణాల వల్ల మరణించాడు.తన తండ్రి పేరున ఉన్న 10 ఎకరాల భూమిని పెద్ద కుమారుడు చనిపోకముందే రిజిస్టర్ చేసుకున్నాడు.అనంతరం తన కోడలు మంగ,మనుమడు వినోద్ రెడ్డి పేరున భూమి బదళాయింపు జరిగిన సమయములో వృద్ధ దంపతుల భాద్యతలు కోడలు, మనుమడు చూడాలని గ్రామ పెద్దల సమక్షములో ఒప్పందం జరిగిన వారిని పట్టించుకోక పోవడముతో గత కొద్ది రోజుల క్రితం మండల సీనియర్ సిటిజన్ కన్వీనర్ అన్నాడి సత్యనారాయణ రెడ్డి ద్వారా జిల్లా కలెక్టర్ ను ఆశ్రయించారు.జిల్లా కలెక్టర్ ఆర్డిఓకి సిఫార్సు చేయడముతో తక్షణమే విచారణ జరిపిన అధికారి నెలకు పదివేల రూపాయలు పోషణ నిమిత్తం ప్రతినెల 10వ తేదీలోపు వృద్దులకు ఇవ్వాలని కోడలుకు, మనుమనికి ఆదేశాలు జారీ చేయడంతోవృద్ధ దంపతులకు న్యాయం జరిగింది.అదే విధంగా దత్తత వెళ్లిన చిన్న కుమారుడు కూడా 5 వేల రూపాయలు చెల్లించి అమ్మ నాన్నకు చేదోడు వాదోడుగా ఉంటానని చెప్పడం భాద్యతను గుర్తు చేసినట్లు ఉందని సీనియర్ సిటిజన్ మండల కన్వీనర్ పేర్కొన్నారు.

# వరి ధాన్యం రవాణాకు ట్రాక్టర్లు ఉపయోగించాలి

ఇల్లంతకుంట, ప్రభాతవార్త:



కొనుగోలు కేంద్రాల్లో తూకం వేసిన ధాన్యం తరలింపుకు ట్రాక్టర్లను వాడుకోవాలని అదనపు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీనివాస్ సూచించారు.కంది కట్కూర్,కిష్టారావు పల్లె,వల్లంపట్లలో ఐకెపి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రాలను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.కొనుగోలు వేగవంతం చేయాలని, రవాణాలో ఇబ్బంది లేకుండా లారీలతో పాటు ట్రాక్టర్లను వినియోగించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఏ.పి.యమ్ కుమారస్వామి,నిర్వాహకులు, రైతులు, హమాలీలు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు చేయాలని రైతుల ధర్నా

ఇల్లంతకుంట, ప్రభాతవార్త



కష్ట పడి పండించిన వరి ధాన్యం కొనుగోలు చేయాలనీ మండల ములోని పొత్తూరు గ్రామంలో రైతులు బుధవారం ధర్నా చేశారు.కొనుగోలు కేంద్రం ప్రారంభం అయినా ఇప్పటి వరకు వడ్ల తూకం సరిగా చేయట్లేదని వాపోయారు.గ్రామ బస్టాండ్ చౌరస్తా వద్ద ధర్నా చేస్తున్న రైతుల వద్దకు స్థానిక తహసీల్దార్ వెళ్లి విషయం తెలుసుకున్నారు.ధాన్యం కొనుగోలుతో పాటు మిల్లులకు తరలించడానికి వాహనాలను ఏర్పాట్లు చేస్తానని తహసీల్దార్ హామీ ఇవ్వడముతో విరమించారు.నాయకులు శ్రీనివాస్, ఉపసర్పంచ్ బండారి నరేశ్ గౌడ్,వార్డు సభ్యులు తోడేటి సతీష్,బండారి మోనిక మల్లేశం,ఏనుగుల మమత నవీన్ కుమార్,దయ్యాల చంద్రమోళి, వడియాల వెంకట్ రెడ్డి లు, రైతులు పాల్గొన్నారు.

# సిటీ ఫౌండేషన్ ఉత్తమ జర్నలిస్ట్ అవార్డుకు ఫజల్ బేగ్ ఎంపిక

జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:



నసీమ్ ఆరిఫీ ఉర్దూ మీడియా అవార్డ్స్ 2025,..ఉర్దూ మీడియాలో సత్యం, వైవిధ్యం మరియు శ్రేష్ఠతకు పట్టంఉర్దూ జర్నలిజం మరియు మీడియాలో ప్రతిభను, సమగ్రతను మరియు సామాజిక బాధ్యతను గౌరవించడం కోసం సెటి (సి ఈ టి ఐ) ఫౌండేషన్ ఈ అవార్డులను ఏర్పాటు చేసింది. దివంగత ..నసీమ్ ఆరిఫీ జ్ఞాపకార్థం, ప్రజా ప్రయోజనం కోసం మరియు ఉర్దూ మీడియా ప్రాముఖ్యతను చాటిచెప్పేలా కృషి చేసిన వ్యక్తులకు ఈ పురస్కారాలను అందజేస్తారు.నసీమ్ ఆరిఫీ గురించినసీమ్ ఆరిఫీ 1960లలో ది సియాసత్ డైలీ తో తన ప్రస్థానాన్ని ప్రారంభించి, ఆ తర్వాత ది మున్సిఫ్ డైలీ.... ఎడిటర్‌గా దానికి కొత్త రూపాన్ని ఇచ్చారు. అనంతరం ఆయన ది ఎతెమాద్ డైలీ ని స్థాపించారు. బాధ్యతాయుతమైన జర్నలిజం పట్ల ఆయనకున్న నిబద్ధత అందరికీ ఆదర్శప్రాయం.2025 అవార్డు గ్రహీతలుప్రతి ఏటా ఐదు అవార్డులు అందజేస్తారు

# ప్రజా పాలనలో సొంతింటి కల సాకారం

ఇల్లంతకుంట, ప్రభాతవార్త



కాంగ్రెస్ పాలనలో ప్రతి నిరుపేద సొంతింటి కల సాకారమైందని మండలములోని వెంకట్రావుపల్లె సర్పంచ్ నవీన్ పేర్కొన్నారు.గ్రామంలో నూతనంగా నిర్మించిన దార రాజేశ్వరి చంద్రయ్య గృహ ప్రవేశంలో బుధవారం పాల్గొని వారికి పట్టు వస్త్రాలను అందించారు. ప్రజా ప్రభుత్వం ప్రజల పక్షాన నిరంతరం పని చేస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రియాంక,ఉప సర్పంచ్ అనగోని అవినాష్,వార్డు సభ్యులు మంద అనిల్ కుమార్,నర్సింగోజు పద్మ,సొల్లు కనకయ్య, మల్లయ్య పాల్గొన్నారు.

# మత సామరస్యానికి ప్రతీకగా బక్రీద్ పండుగ జరుపుకోవాలి



**జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:**
బక్రీద్ పండుగను పురస్కరించుకొని వివిధ శాఖల అధికారులు, ముస్లిం మరియు హిందూ మత పెద్దలతో పీస్ మీటింగ్ నిర్వహించిన జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ .బుధవారం రోజున జగిత్యాల జిల్లాలో బక్రీద్ సందర్భంగా జిల్లా సమీకృత కార్యాలయంలో జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మరియు జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, జిల్లా స్థాయి అధికారులు మరియు మత పెద్దలు పాల్గొన్నారు . ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో బక్రీద్ పండుగను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. గ్రామాల్లో మరియు పట్టణాల్లో మసీద్ లవద్ద పారిశుధ్య నిర్వహణ మరియు స్లాటర్ హౌసెస్ వద్ద పారిశుధ్య నిర్వహణ వేస్టేజ్ డిస్పోజ్ వెంటది వెంటనే తొలగించే విధంగా కవర్లు అందించడం వంటి విషయాల్లో తగు చర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయితీ అధికారి మరియు మున్సిపల్ కమిషనర్ లను ఆదేశించారు. పశువుల రవాణా మరియు సర్టిఫికేషన్ విషయంలో వెటర్నరీ అధికారులు నిరంతరం అందుబాటులో ఉంటూ వెనువెంటనే తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో 5 చెక్పోస్టులు (వెల్గటూర్, ధర్మపురి, మెట్ పెల్లి, కొడిమ్యాల, రాయికల్ ) ఏర్పాటు చేశామని తెలిపారు. బక్రీద్ పండుగను మన జిల్లాలో మత సామరస్యానికి ప్రతీకగా జరుపుకోవాలని దీనికి అందరు సహకరించాలని కోరారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ మాట్లాడుతూ బక్రీద్ పండుగను మతసామరస్యంగా నిర్వహించుకోవాలని అందుకు అన్ని మతాలవారు సహకరించాలని అన్నారు. బక్రీద్ పండుగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ బందోబస్తులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా సోషల్ మీడియా ప్రచార పట్ల అప్రమత్తంగా ఉండాలని వాటిపై ఫోకస్ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అంతకుముందు మత పెద్దల నుండి బక్రీద్ పండుగ సందర్భంగా సలహాలు, సూచనలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అడిషనల్ ఎస్పీ చేతన్ నితిన్, అడిషనల్ కలెక్టర్ (లోకల్ బాడీ ) బి. రాజ గౌడ్, డి ఎండబ్ల్యు జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి కిషోర్, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, పోలీస్ అధికారులు, మున్సిపల్ కమిషనర్ లు మరియు సంబంధిత అధికారులు, వివిధ మత పెద్దలు మరియు తదితరులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో పెద్దమ్మ-పెద్దిరాజుల కళ్యాణం

-కొడిమ్యాలలో వైభవంగా ఉత్సవాలు

-ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలి

- మాజీ ఎమ్మెల్యే రవిశంకర్



**కొడిమ్యాల, ప్రభాతవార్త:**
జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండల కేంద్రంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ పెద్దమ్మ-పెద్దిరాజుల కళ్యాణ మహోత్సవం భక్తిశ్రద్ధల నడుమ ఘనంగా నిర్వహించారు. పెద్దమ్మ గుడి ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోగా ప్రత్యేక అలంకరణలు, మంగళ వాయిద్యాలు, పూజా కార్యక్రమాలతో ఆలయం ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది. ఈ మహోత్సవానికి చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్రంలో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని, రైతులకు పంటలు బాగా పండాలని ఆయన ప్రార్థించారు. అనంతరం ముదిరాజ్ సంఘం నాయకులు బల్ల అంకుస్, బల్ల శేఖర్, గుడిపల్లి మల్లేశం, రాజు, చందు తదితరులు మాజీ ఎమ్మెల్యేకు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో భారాస మండల అధ్యక్షులు పులి వెంకటేష్ గౌడ్, మాజీ సర్పంచ్ పిడుగు ప్రభాకర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ గడ్డం చంద్రమోహన్ రెడ్డి, యువజన అధ్యక్షులు గడ్డం లక్ష్మారెడ్డి, పట్టణ అధ్యక్షులు కొత్తూరి స్వామి, హిందూ సమ్మేళన అధ్యక్షులు రాచకొండ చంద్రమోహన్, మంద మల్లేశం గౌడ్ పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

# వరి ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

తూకం వేసిన ధాన్యం వెంటనే రైస్ మిల్లులకు తరలించాలి

జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్



**సారంగాపూర్-ప్రభాతవార్త:**
జిల్లాలోని సారంగాపూర్ మండల కేంద్రం, రేచ పెల్లి, లచ్చ నాయక్ తాండ నాగునూర్ గ్రామాల్లో పాక్స్, ఐకెపి, డీసీఎంఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరి ధాన్య కొనుగోలు కేంద్రాలను బుధవారం ఆకస్మికంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ కేంద్రాలకు వచ్చిన వరి ధాన్యాన్ని మ్యాచర్ వచ్చిన వెంటనే ఆలస్యం లేకుండా తూకం వేసి మిల్లులకు తరలించాలని అధికారులను ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, సకాలంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు.ధాన్యం తూకం, నిల్వ రవాణా ప్రక్రియల్లో ఎటువంటి నిర్లక్ష్యం ఉండకూడదని, రైతులకు సమగ్ర సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు తెలిపారు. అదేవిధంగా రాష్ట్రంలో జిల్లాలో అకాల వర్షాలు ఉన్నందున వారి ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు గన్ని సంచులు, టార్పలిన్ లు అందుబాటులో ఉంచుకోవాలని అన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే డాటా ఎంట్రీ ఆన్లైన్ చేసి రైతులకు ఖాతాలో డబ్బులు జమ అయ్యే విధంగా చూడాలని అన్నారు. అదేవిధంగా మిల్లుల వద్ద త్వరగా అన్లోడింగ్ చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద టార్పాలిన్ కవర్లు అవసరం మేరకు అందుబాటులో ఉంచుకొని పాడీని ప్రొటెక్ట్ చేయాలని అన్నారు. ఈ పరిశీలనలో జగిత్యాల ఆర్డీవో మధు సూదన్, డీఆ ర్డీవో రఘువరన్, సారంగాపూర్ మండల తహసిల్దార్ వహిదోద్దీన్, గిర్దవార్ వెంకటేష్,సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ లబ్ధిదారుల ఇళ్లు ప్రారంభించిన ఎమ్మెల్యే



**జగిత్యాల,రూరల్ ప్రభాతవార్త:** జగిత్యాల మండలం రూరల్ వెల్దుర్తి గ్రామంలో పసుల సునీత దేవయ్య దంపతులు నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇళ్లు గృహ ప్రవేశ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ గృహప్రవేశంలో పాల్గొని, లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలియజేశారు.అనంతరం లబ్ధిదారులకు చీరను కానుకగా అందజేశారు. పేదల సొంతింటి కల సాకారం కావడమే ఇందిరమ్మ రాజ్య లక్ష్యమని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గాజంగి నందయ్య, ఏఎంసీ ఛైర్మన్ గడ్డం నారాయణరెడ్డి, మాజీ ఏఎంసీ ఛైర్మన్ కొలుగురి దామోదర్ రావు సర్పంచ్లు పల్లె లక్ష్మీ రవి,ప్రకాష్,వంశీ, నాయకులు మహేశ్వర్ రావు, బాల ముకుందం, శాంతపు రావు,ఉప సర్పంచ్ బందేల రాజా శేఖర్,మాజీ ఎంపీటీసీ శంకర్,పడిగేలా శ్రీనివాస్, శ్రీకాంత్,వార్డు సభ్యులు రమేష్,రాజ్ కుమార్ తో పాటు పలువురు అధికారులు,పార్టీ నాయకులు గ్రామస్తులు పాల్గొన్నారు.

# జగిత్యాల వార్త



## విద్యార్థుల భవిష్యత్తుతో రాజకీయాలు చేయొద్దు

చదువుల తల్లి స్థలం కోసం ఎంపీ అరవింద్ ధర్మదీక్ష

జగిత్యాల బీజేపీ నియోజకవర్గ ఇంచార్జీ డాక్టర్ భోగ శ్రావణి

**రాయికల్ ప్రభాతవార్త:**



రాయికల్ పట్టణంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో జగిత్యాల బీజేపీ నియోజకవర్గ ఇంచార్జీ డాక్టర్ భోగ శ్రావణి మాట్లాడుతూ.. విద్యార్థుల భవిష్యత్తు కోసం నిజామాబాద్ ఎంపీ చేపట్టనున్న ధర్మదీక్షకు ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద ఎత్తున మద్దతు ఇవ్వాలని కోరారు.చదువుల తల్లి స్థలం కోసం, నవోదయ పాఠశాల మరియు కేంద్రీయ విద్యాలయాల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్థలం కేటాయించాలని ఆమె డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం విద్యాభివృద్ధి కోసం ముందుకు వచ్చి పాఠశాలలను మంజూరు చేసినప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా స్థలం కేటాయించకుండా జాప్యం చేస్తోందని విమర్శించారు.విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తుంటే, రాష్ట్ర ప్రభుత్వం రాజకీయ కుట్రలతో విద్యార్థుల భవిష్యత్తును గాలికి వదిలేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. జగిత్యాల నియోజకవర్గంలో కేంద్రీయ విద్యాలయాన్ని మంజూరు చేపియాల్సిందిగా నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అరవింద్ని అడిగిన వెంటనే వారు పిల్లల భవిష్యత్తు కోసం కేంద్రీయ విద్యాలయాన్ని మంజూరు చేపియడం జరిగింది. కానీ స్థలం కేటాయింపులో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు.పక్కనే ఉన్న కోరుట్ల నియోజకవర్గంలో ఇప్పటికే నవోదయ పాఠశాల ప్రారంభమై అడ్మిషన్లు కూడా కొనసాగుతున్నాయని గుర్తు చేశారు. జగిత్యాలలో కూడా సమయానికి స్థలం కేటాయించి ఉంటే ఇప్పటికి పాఠశాల ప్రారంభమై విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేదని పేర్కొన్నారు. ఈ నెల 15వ తేదీ లోపు రాష్ట్ర ప్రభుత్వం స్థలం కేటాయించాలని గడువు ఇచ్చామని, ఆలోపు చర్యలు తీసుకోకపోతే జగిత్యాల జిల్లా కేంద్రంలోని తహసీల్దార్ చౌరస్తా వద్ద అంబేద్కర్ విగ్రహం ఎదుట ఎంపీ ధర్మపురి అరవింద్ ఆధ్వర్యంలో నిరాహార దీక్ష చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాయికల్ పట్టణ అధ్యక్షులు కుర్మా మల్లారెడ్డి,రాయికల్ మండల్ అధ్యక్షులు ఆకుల మహేష్, రాయికల్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కల్లెడ ధర్మపురి, 11వ వార్డ్ కౌన్సిలర్ పురె శ్రీధర్,శితిదిలీ చైర్మన్ ముత్యం రెడ్డి,కునారపు భూమేష్, రవీందర్ రెడ్డి, వేముల రాము,తోపారపు సురేష్,పటేల్ రాము,సమల్ల సతీష్,సింగని సతీష్,విజయ్ మరియు తదితరులు పాల్గొన్నారు.

## అంతర్గాం శివారులో భూకబ్జా తహసిల్దార్కు గ్రామస్తుల ఫిర్యాదు

**జగిత్యాల,రూరల్ ప్రభాతవార్త:**
జగిత్యాల మండలం రూరల్ అంతర్గాం గ్రామ శివారులోని రెవెన్యూ భూమి ఆక్రమణకు గురైందని గ్రామస్తులు బుధవారం రోజున తహసిల్దార్ హాకీంకు వినతి పత్రాన్ని అందజేశారు. రెవెన్యూ సర్వే నంబర్ 523లో ఉన్న 27 గుంటల భూమిని జగిత్యాలకు చెందిన కొండ లక్ష్మణ్ అనే వ్యక్తి అక్రమంగా కబ్జా చేశారని గ్రామస్తులు నక్కల రవీందర్ రెడ్డి,భువనగిరి నారాయణ,అబ్బాడి సోమేశ్వర్ ఈ మేరకు ఫిర్యాదులో పేర్కొన్నారు.భూమిని దౌర్జన్యంగా ఆక్రమించి,హద్దులు చెరిపివేయడమే కాకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని బాధితులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి, వెంటనే సర్వే నిర్వహించి హద్దులు నిర్ణయించాలని కోరారు.కబ్జాదారుల నుంచి భూమిని విడిపించి స్వాధీనం చేయాలని, అక్రమాలకు పాల్పడుతున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు కోరారు.



# బ్లడ్ క్యాన్సర్ చికిత్సలో విప్లవాత్మక మార్పులు

**కరీంనగర్ రూరల్,ప్రభాతవార్త:**

రక్త క్యాన్సర్ చికిత్స రంగంలో సాంకేతిక విప్లవం చోటుచేసుకుంటోందని, అత్యాధునిక వైద్య పద్ధతుల ద్వారా రోగులకు మెరుగైన ఫలితాలు అందుతున్నాయని యశోద హాస్పిటల్ ప్రముఖ హెమటాలజిస్ట్ డాక్టర్ శ్రీనివాస్ చక్రవర్తి తెలిపారు. బుధవారం కరీంనగర్‌లోని యశోద ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంతో పోలిస్తే ప్రస్తుతం బ్లడ్ క్యాన్సర్ చికిత్స మరింత ఖచ్చితంగా, సమర్థవంతంగా మారిందని పేర్కొన్నారు. ఆరోగ్యకరమైన కణాలకు ఎటువంటి నష్టం కలగకుండా, కేవలం క్యాన్సర్ కణాలను మాత్రమే లక్ష్యంగా చేసుకుని టార్గెటెడ్ మెడిసిన్స్, ఇమ్యూనో థెరపీ చికిత్స అందిస్తారనీ వివరించారు. కార్ టి సెల్ థెరపీ దీనిని "లివింగ్ డ్రగ్"గా అభివర్ణించారు. ఇందులో రోగి సొంత కణాలకే శిక్షణ ఇచ్చి, అవి క్యాన్సర్ కణాలపై పోరాడేలా చేస్తారనీ తెలిపారు. క్లిష్టమైన కేసుల్లో కూడా ఇది అద్భుత ఫలితాలను ఇస్తోందన్నారు. ప్రెసిషన్ థెరపీ తో రోగి జన్యు పరిస్థితిని ఆధారంగా ప్రత్యేకమైన చికిత్స అందించడం ద్వారా త్వరితగతిన కోలుకునే అవకాశం ఉంటుందన్నారు. ఆధునిక బోన్ మారో ట్రాన్స్‌ప్లాంట్ పద్ధతులతో రోగులు చికిత్స అనంతరం ఎక్కువ కాలం నాణ్యమైన జీవితాన్ని గడపగలుగుతున్నారని తెలిపారు. ఒకప్పుడు విదేశాల్లో మాత్రమే అందుబాటులో ఉన్న ఇలాంటి అత్యాధునిక చికిత్సలు ఇప్పుడు భారతదేశంలో సామాన్యులకు కూడా అందుబాటులోకి రావడం శుభపరిణామమని ఆయన అన్నారు. వైద్య రంగంలో వస్తున్న మార్పుల వల్ల బ్లడ్ క్యాన్సర్ అంటే భయపడాల్సిన పనిలేదన్నారు. సరైన సమయంలో సరైన చికిత్స తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యవంతులు కావచ్చునీ తెలిపారు. ఈ సమావేశంలో యశోద హాస్పిటల్ మార్కెటింగ్ ప్రతినిధులు శ్రీకాంత్, మహేందర్, తదితరులు పాల్గొన్నారు.



# విద్యతోనే దేశ భవిష్యత్తు నిర్మాణం అవుతుంది

## సూడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి

**కరీంనగర్ కలెక్టరేట్, ప్రభాతవార్త:**

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా విద్యా వారోత్సవాలు ఘనంగా నిర్వహించడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో కరీంనగర్ అర్బన్, కరీంనగర్ రూరల్, కొత్తపల్లి మండలాలకు సంబంధించిన కార్పొరేటర్లకు, సర్పంచులకు ఒకరోజు కార్యశాలను బుధవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సుడా చైర్మన్ మాట్లాడుతూ ప్రభుత్వం పాఠశాల విద్య కోసం అధిక నిధులు వెచ్చిస్తుందన్నారు. విద్యాభివృద్ధి కోసం వినూత్నమైన కార్యక్రమాలను చేపడుతుందని పేర్కొన్నారు.. ఏ దేశమైనా మౌలికంగా అభివృద్ధి చెందాలంటే విద్యాపరంగా అభివృద్ధి పథంలో పయనించాలని విద్యాభివృద్ధి జరిగితేనే దేశాభివృద్ధి జరుగుతుందని వారు తెలిపారు.. ప్రభుత్వం విద్యార్థుల కోసం ఉచిత నోటు పుస్తకాలను, పాఠ్య పుస్తకాలను, వర్క్ బుక్కులను ఇవ్వడంతో పాటు పిల్లలు ఉదయమే అల్పాహారం తీసుకోకుండా పాఠశాలకు వెళ్తే చెప్పే పాఠాలు సరిగా అర్థం కాకుండా ఉండే ప్రమాదం ఉందని వచ్చే విద్యా సంవత్సరం నుండి అల్పాహార పథకం కూడా ప్రవేశపెడుతుందని పేర్కొన్నారు.. పాఠశాల విద్యకు అవసరమైన ఎన్నో మౌలిక సదుపాయాలను ప్రభుత్వం సమకూర్చుతుందని అందులో భాగంగా పూర్వ ప్రాథమిక విద్య కోసం ప్రీ ప్రైమరీ పాఠశాలలు ఏర్పాటు చేసి ఆంగ్ల మాధ్యమంలో విద్యాబోధన ఏర్పాటు చేయడం, తెలంగాణ పబ్లిక్ స్కూల్ పేరుతో ప్రీ ప్రైమరీ నుండి ఇంటర్మీడియట్ వరకు ఒకే ఆవరణలో పాఠశాల నిర్మాణం చేపట్టడం జరుగుతుందని తెలిపారు..




# సీబీఎస్ఇ 12వ తరగతి ఫలితాల్లో అల్ఫోర్స్ జయకేతనం

**కరీంనగర్ టౌన్, ప్రభాతవార్త:**

చక్కటి ప్రణాళికలతో ముందుకువెళ్తే విద్యార్థులతో విజయాలను సులభంగా సాధింప చేయవచ్చని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి అన్నారు. బుధవారం కరీంనగర్ వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ టైనీ టాట్స్ ప్రాంగణంలో అల్ఫోర్స్ సీబీఎస్ఈ సీనియర్ సెకండరీ పాఠశాలకు చెందినటువంటి విద్యార్థులు 12వ తరగతి ఫలితాల్లో అత్యుత్తమ మార్కులు సాధించడంతో ప్రత్యేక అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ అల్ఫోర్స్ విద్యాసంస్థల్లో విద్యార్థులకు అత్యుత్తమ ప్రమాణాలు పాటించడమే కాకుండా జాతీయ స్థాయిలో గుర్తింపు పొందినటువంటి అధ్యాపకులచే బోధన అందిస్తూ అగ్రగామిగా నిలుపుతున్నామని సంతోషం వ్యక్తం చేశారు. అన్ని విభాగాల్లో పైచేయి సాధించడం, ఇప్పటివరకు ప్రకటించినటువంటి అన్ని రకాల పరీక్షల ఫలితాల్లో స్ఫూర్తిదాయకమైన మార్పులతో ఆదర్శంగా నిలిచిందని తెలిపారు. 7గురు విద్యార్థులు 460 పైగా సాధించారని, 47 మంది విద్యార్థులు 400 మార్కులు పైగా సాధించడం చాలా గొప్ప విషయమని పేర్కొన్నారు.. అందులో పిసిఎం విభాగంలో వి.శ్రేయాస్ రెడ్డి, 475 మార్కులతో పాఠశాలలో ప్రథమ స్థానంలో నిల్చాడని, జి.చైత్ర 471, ఎన్.రత్నప్రకాష్ 469, బి.లిఖిత్ సాయి 461, కే.ఐశ్వర్య 458, హర్షఫ్ అర్మాన్ 456, వి.సాయి హర్షిత్ 456, రోహిత్ 455, ఎన్.కావ్య, జె.సరయు 450 మార్కులు సాధించారని వెల్లడించారు. పిసిబి విభాగంలోడి.రుత్విక్, 476 మార్కులు తో పాఠశాలలో ప్రథమస్థానంలో నిలిచాడని, పి.శృత్విక 472, డి.శ్రేయన్ష్ 462 అత్యుత్తమ మార్కులు సాధించారని చెప్పారు. అధ్యాపకుల నిరంతర కృషితో తల్లిదండ్రుల అమూల్యమైనటువంటి సహకారంతో ఈ అద్భుతమైన ఫలితాలు సాధ్యమవుతున్నాయని అన్నారు. గత 36 సంవత్సరాలుగా అల్ఫోర్స్ విద్యాసంస్థలు చాలా చక్కటి కార్యక్రమాలతో ప్రపంచ ప్రమాణాలను పాటింపచేస్తూ భారతదేశంలో గుర్తింపు పొందిన బోధనా సిబ్బందితో బోధిస్తూ అగ్రగామిగా ఉంటున్నామని చెప్పారు. చాలా చక్కటి ఫలితాలు సాధించిన విద్యార్థులకు పుష్పగుచ్చాలను, స్కోర్ కార్డ్స్ అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠ శాల కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# విద్యాభివృద్ధి రేపటి భవిష్యత్తుకు పెట్టుబడి

## -- ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి

**జమ్మికుంట/హుజురాబాద్, ప్రభాత వార్త:**

నేటి బాలలే రేపటి దేశ గౌరవాన్ని పెంచే పౌరులని, వారి సమగ్రాభివృద్ధికి నాణ్యమైన విద్యే పునాది అని, విద్యాభివృద్ధి రేపటి భవిష్యత్తుకు పెట్టుబడి అని హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని విఎల్ఆర్ ఫంక్షన్ హాల్‌లో ప్రజా పాలన విద్యా వారోత్సవాల సందర్భంగా ప్రజా ప్రతినిధులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రభుత్వం విద్య కోసం చేసే ఖర్చును వృథాగా చూడరాదని, అది భావి తరాల అభివృద్ధికి చేసే గొప్ప పెట్టుబడి అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో గురుకుల పాఠశాలల ఏర్పాటు ద్వారా అట్టడుగు వర్గాల పిల్లలకు నాణ్యమైన విద్యను అందించారని, ఒక్కో విద్యార్థిపై లక్షలాది రూపాయలు వెచ్చించినట్లు గుర్తు చేశారు. విద్యా సంవత్సరం ప్రారంభంలోనే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్ అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే పదవ తరగతి ఫెయిల్ అయిన విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన కోచింగ్ సెంటర్లను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మున్సిపల్ చైర్ పర్సన్ రొంటాల సుహాసిని మాట్లాడుతూ... ఒక అబ్బాయి చదివితే ఆ వ్యక్తి మాత్రమే ఎదుగుతాడు, కానీ ఒక అమ్మాయి చదివితే ఆ కుటుంబమే వెలుగులోకి వస్తుంది అని వ్యాఖ్యానించారు. పుస్తకం పట్టిన వాడే చరిత్ర సృష్టిస్తాడని ఆమె ఉద్ఘాటించారు. సిడిపిఓ సుగుణ బాల్య వివాహాల నిర్మూలనలో ప్రజాప్రతినిధుల పాత్ర కీలకమని పేర్కొనగా, ఎంఈఓ శ్రీనివాస్ విద్యార్థుల కోసం నిర్వహిస్తున్న రెమెడియల్ క్లాసుల ప్రాముఖ్యతను వివరించారు. ఈ సదస్సులో పలువురు కౌన్సిలర్స్, ఎంపీడీఓలు, ఎంఈఓలు పాల్గొన్నారు.






# ధాన్యం దిగుమతులు వేగవంతం చేయాలి

## -- జిల్లా కలెక్టర్ చిత్ర మిశ్రా

**సైదాపూర్, ప్రభాత వార్త:**

జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని, సేకరించిన ధాన్యాన్ని రైస్ మిల్లులలో ఎప్పటికప్పుడు దిగుమతి చేసుకునేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ చిత్ర మిశ్రా అధికారులను ఆదేశించారు. బుధవారం సైదాపూర్ మండలంలోని దుద్దనపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఆమె ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా సెంటర్ ఇంచార్జీలతో మాట్లాడి.. ఇప్పటి వరకు కేంద్రాలకు వచ్చిన ధాన్యం ఎంత తూకం పూర్తై మిల్లులకు తరలించిన వివరాలేమిటి....? అని ఆరా తీశారు. క్షేత్రస్థాయిలో టార్పాలిన్ల లభ్యత, రవాణా వాహనాల ఏర్పాటు, హమాలీల పనితీరుపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. సెంటర్ ఇంచార్జీలు ఉన్నతాధికారులతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ కొనుగోలు ప్రక్రియలో జాప్యం లేకుండా చూడాలని, కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని, హమాలీలు, రవాణా సంబంధిత సమస్యలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, ఏదైనా సమస్య ఉంటే వెంటనే రెవెన్యూ, పోలీస్ అధికారుల దృష్టికి తీసుకురావాలని అన్నారు. ఈ తనిఖీలో కలెక్టర్ వెంట తహశీల్దార్ గుర్రం శ్రీనివాస్ గౌడ్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



# బైక్ ను ఢీకొట్టిన లారీ..... ధ్వంసమైన బైక్.

**వీణవంక, ప్రభాత వార్త:**

వీణవంక మండలము పోతిరెడ్డి పల్లి గ్రామ శివారులో బుధవారం ఓ లారీ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో బైక్ ధ్వంసమై వ్యక్తి ప్రాణాపాయం నుండి బయట పడ్డాడు. వివరాలు ఇలా ఉన్నాయి. పోతిరెడ్డి పల్లి గ్రామానికి చెందిన చెవుల అనిల్ టి ఎస్ 02 ఇవి 5697 నెంబర్ గల తన బైక్ పై వ్యవసాయ పనుల కోసం వెళుతుండగా ఎదురుగా ఇసుక రీచ్ నుండి లోడ్ తో వస్తున్న లారీ కొందపాక మూల మలుపు వద్ద బైక్ ను ఢీకొట్టడంతో బైక్ ధ్వంసమైంది. బాధితుడు లారీ నీ అడ్డుకొనేందుకు పరుగెత్తగా అతి వేగంగా వెళ్ళి పోయింది. దీంతో ఏమి చేసేది లేక వెంటనే 100 కాల్ చేసి సమాచారమందించారు. న్యాయం జరిగే దాకా మిగతా ఇసుక లోడ్ లారీలను పోనివ్వకుండా తన కుటుంబ సభ్యుల తో అడ్డుకొన్నానని తెలిపాడు.



# మక్కజొన్న రైతులను.. మాయచేస్తున్న మార్క్‌ఫెడ్.. అధికారులు..

**15రోజులుగా 50వేల బస్తాలు మార్కెట్‌లో పెట్టుకుని పడిగాపులు కాస్తున్న రైతులు..**

**ప్రభుత్వ తీరుపై నిప్పులు చెరిగిన.. ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి**

జమ్మికుంట/హుజురాబాద్, ప్రభాతవార్త:
తెలంగాణ రాష్ట్రంలో గత రెండు సంవత్సరాలుగా రైతాంగం అతివృష్టి, అనావృష్టి సమస్యలతో సతమతమవుతూ, ఆరుగాలం కష్టించి, పండించిన పంటలు మార్కెట్‌లో అమ్మబోతే అడవిగా.. కొనపోతే కొరివిగా... రైతుల పరిస్థితులు దాపరించాయని జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌లో గత 15రోజులుగా వందలాది మంది రైతులు 50వేల మక్కజొన్న బస్తాలను నిత్యం ఎండలో ఎండబోస్తూ, ఆకాల వర్షాలకు భయపడి, సాయంత్రం కుప్పలుగా చేస్తూ కొనుగోళ్ల కోసం మార్కెట్‌లో పడరాని పాట్లు పడుతున్న రాష్ట్ర ప్రభుత్వం మార్క్‌ఫెడ్ అధికారులపై యజమాయిషీగా కరువై, కొనుగోళ్లలో తీవ్రజాప్యం జరుగుతుందని కరీంనగర్ జిల్లా హుజురాబాద్ నియోజకవర్గం శాసనసభ్యుడు పాడి కౌశిక్‌రెడ్డి మార్క్‌ఫెడ్ అధికారుల తీరుపై మండపడ్డారు.

బుధవారం జమ్మికుంట కొత్త మార్కెట్‌లోని మార్క్‌ఫెడ్ కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి, జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్‌కుమార్, జిల్లా కెడిసిసి వైస్ చైర్మన్ పింగిలి రమేష్, సహాకార సంఘం చైర్మన్ పొనగంటి సంపత్‌కుమార్, రాష్ట్ర ఎస్సి కార్పోరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్‌లు ఆకస్మికగా తనిఖీ చేసారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి, ఆయన వెంట ఉన్న బృందం అనేక మంది రైతులను వారు పడుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. పలువురు రైతులు మండటండల్లో వారు పడుతున్న కష్టాన్ని కంటతడి పెడుతూ అనేక వివరాలు వెల్లడించారు. మక్కజొన్న పంటను అమ్ముకోవడానికి మార్కెట్‌కు వస్తే మార్క్‌ఫెడ్ అధికారులు రేపు...మాపు అంటూ తేమ పేరుతో నరకయాతన పెడుతున్నారని పలువురు రైతులు అందోళన వ్యక్తం చేసారు. రైతుల సమస్యలను విన్న ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి స్పందిస్తూ ఆయన రాష్ట్ర ప్రభుత్వ అధేశానుసారం మార్క్‌పెడ్ అధికారులు మార్కెట్ పాలకవర్గం సంబంధిత అధికారులు కొనుగోళ్లపై ఎందుకు దృష్టిసారించడంలేదని ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి సూటిగా ప్రశ్నించారు. రైతులకు అన్యాయం జరుగుతూ చూస్తు ఊరుకోలేమని ఎమ్మెల్యే తీవ్రంగా హెచ్చరించారు. రైతు ఏడ్చిన రాజ్యం.. ఎద్దేడ్చిన ఎవుసాయం. చరిత్రలో సుభిక్షంగా ఉన్నట్లు ఎక్కడ దాఖలాలు లేవన్నారు. ఇన్ని వేల బస్తాలు రోజుల తరబడి మార్కెట్‌లో ఎందుకు ఉంచుకుంటున్నారని రైతులు అన్నపానీయాలకు అవస్థలు పడుతూ, కష్టాలపాలవుతున్నారని మార్క్‌ఫెడ్ అధికారులపై ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేసారు. రెండు రోజుల్లో మార్కెట్‌లో ఉన్న మక్కజొన్న బస్తాలను తూకం వేసి తరలించకపోతే మార్కెట్ యార్డులోనే రైతులతో కలిసి ఇక్కడే నిద్రిస్తానని కౌశిక్‌రెడ్డి హెచ్చరించారు. రైతులకు అన్యాయం జరుగుతే చూస్తూ ఉరుకోమని ఆయన ప్రభుత్వ తీరుపై నిప్పులు చెరిగారు. జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌లో మార్క్‌ఫెడ్ అధికారులు జాప్యం చేస్తూ మక్కజొన్న రైతులను మాయచేస్తున్నారని కౌశిక్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేసారు.

**మక్కల తరలింపుకు డబ్బులు డిమాండ్...?**

ప్రభుత్వానికి మద్దతు ధరలకు అమ్ముకోవడానికి మార్కెట్‌కు వచ్చిన రైతుల నుండి కొనుగోలు చేసిన మక్కలను గోదాంలకు తరలించడానికి కొంతమంది రైతులను డబ్బులు డిమాండ్ చేస్తున్నారని, రైతులు ఆవేదన చెందడం దురదృష్టకరమని ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేసారు. అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మార్క్‌ఫెడ్ అధికారులకు సూచించారు. ఇది ఇలా ఉండగా.. హామాలీల కొరతతో లోడింగ్, అన్‌లోడింగ్ పనులు పూర్తిగా దెబ్బతిన్నాయని మార్కెట్ సిబ్బంది ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. ఆ సమస్యను వెంటనే పరిష్కరిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. మార్కెట్‌లో రైతులు ఇబ్బంది పడకుండా అదనంగా హామాలీలను ఏర్పాటు చేసుకుని కొనుగోలు వేగవంతం చేయాలని ఆయన అధికారులకు సూచించారు. అనంతరం మార్కెట్ చైర్మన్ పుల్లూరి స్వప్న సదానందం, పాలకవర్గంసభ్యులు, ఆర్డివో రమేష్‌బాబు,

మార్క్‌ఫెడ్ డిఎం, అధికారులు వెనువెంటనే రైతులతో సమావేశమై తక్షణమే కొనుగోలు సవ్యంగా జరగేవిధంగా చర్యలు తీసుకోవాలని అభిప్రాయం వ్యక్తం చేసారు. మక్కల తరలింపులో జాప్యం జరిగితే కఠినమైన చర్యలు తీసుకుంటామని, రైతుల ఆగ్రహానికి గురికాకతప్పదని ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ వైస్ చైర్మన్ ఎర్ర సతీష్‌రెడ్డి, అడ్తిదారుల సంఘం అధ్యక్షులు ఎర్రబెల్లి రాజేశ్వర్‌రావు, మున్సిపల్ వైస్ చైర్మన్ ముంతాజ్ అలీ, మున్సిపల్ కౌన్సిలర్లు పొనగంటి రాము, మార్కెట్ డైరెక్టర్‌లు ఎగ్గటి సదానందం, హామాలీ సంఘం నాయకులు, రైతు సంఘాల నాయకులు వందలాది మంది పాల్గొన్నారు.



# గర్భిణీలు, బాలింతల పట్ల వైద్యులు ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలి..

**జిల్లా కలెక్టర్ చిత్రమిశ్రా**

**జమ్మికుంట ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మిక తనిఖీ..**

జమ్మికుంట/హుజురాబాద్, ప్రభాతవార్త:
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సర్కార్ దవాఖానాలను ప్రైవేట్ కార్పోరేట్ ఆసుపత్రులకు దీటుగా సర్వహంగులతో ఆధునీకరిస్తున్నదని ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే.. రోగుల పట్ల వైద్య సిబ్బంది స్నేహపూర్వకంగా ఉంటూ గర్భిణీలు, బాలింతల పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని కరీంనగర్ జిల్లా కలెక్టర్ చిత్రామిశ్రా ప్రభుత్వ వైద్యులను అదేశించారు. బుధవారం కరీంనగర్ జిల్లా జమ్మికుంట ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేసారు. ఆసుపత్రిలో అడుగుపెట్టిన మరుక్షణమే పేషంట్లు చికిత్స పొందుతున్న జనరల్ వార్డు, ఓపి, ఐసి, కేంద్రాలను సిబ్బంది రోజువారి రిజిస్టర్‌లను పరిశీలించారు. వార్డులలో తిరుగుతూ, రోగులను వారికి అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ చిత్రమిశ్రా మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలు అందించాలని, వైద్య సిబ్బంది 24గంటలు ఆసుపత్రిలో అందుబాటులో ఉండాలని కలెక్టర్ సూచించారు. ఆసుపత్రిలో పనిచేస్తున్న వైద్య సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఖాళీగా ఉన్న పోస్టులను ఆమె నమోదు చేసుకున్నారు. చికిత్స పొందుతున్న రోగుల సంఖ్య రోజువారి ఐపి, ఓపి పేషంట్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలోని ల్యాబ్, డ్రెస్సింగ్ రూం, మహిళలు, పురుషుల ప్రత్యేక వార్డులను ఆమె పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చే రోగుల పట్ల మానవీయత, జాలి చూపాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించడంతో పాటు వేసవికాలం తీవ్రత ఎక్కువగా ఉండడం వల్ల గర్భిణీలు, బాలింతల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆమె అధేశించారు. ప్రభుత్వ ఆసుపత్రిలోనే సాధారణ ప్రసావాలను ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చి, పేషంట్లను మానసికంగా వారిని సంసిద్ధం చేయాలని ఆమె పలు సూచనలు చేసారు. ప్రభుత్వం అందిస్తున్న వసతులను రోగులకు అందించే విదంగా చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా సానిటేషన్ సిబ్బందికి అవసరమైన రక్షణ కవచాలను అందించాలని ఆమె అదేశించారు. ఆమె వెంట జమ్మికుంట తహసిల్దార్ వెంకట్‌రెడ్డి, మెడికల్ ఆఫీసర్ సంపత్‌రెడ్డిలతో పాటు పలువురు సిబ్బంది ఉన్నారు.



# మోడల్ స్కూల్ లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం.

.వీణవంక, ప్రభాత వార్త:
వీణ వంక మండలం లోని ఘనముక్కుల మోడల్ స్కూల్ లో ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు బుధవారం నుండి ఆన్లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఆ స్కూల్ ఇంచార్జి ప్రిన్సిపాల్ మొయిజ్ బేగ్ తెలిపారు.ఈ స్కూల్ లో నీ ఇంటర్ కోర్సు లు బి.పి.సి, ఎం.పి.సి.,సి .ఈ.సి, ఎ సి ఈ లో 4న్ల చొప్పున సీట్లు కలవు .కాగా ఆన్లైన్ దరఖాస్తుల కోసం ఈ నెల వరకు చివరి తేదీగా తెలిపాడు. రిజర్వేషన్ ల నిబంధనల ప్రకారం పదవ తరగతి మెరిట్ ఆధారంగా సీట్లు ఈ నెల 26న కేటాయించబడుతాయని. ఆయన వివరించాడు .ఈ స్కూల్ లో కార్పొరేట్ కళాశాలలకు దీటుగా విద్యాబోధన ,వసతులు ఉన్నందు వలన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరాడు.

# మున్సిపల్ చైర్మన్ కార్యాలయాన్ని ప్రారంభించిన.. ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి

జమ్మికుంట/ హుజూరాబాద్, ప్రభాతవార్త:
జమ్మికుంట 23వ వార్డు పాత వ్యవసాయ మార్కెట్ సమీపాన పద్మశాలి భవనం పక్కన జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ (దిలీప్) కార్యాలయాన్ని హుజురాబాద్ నియోజకవర్గ శాసనసభ్యులు పాడి కౌశిక్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ ప్రజలకు అనునిత్యం అందుబాటులో ఉండేందుకు, ప్రజల కష్టసుఖాలు తెలుసుకోవాలని వారికి అందుబాటులో ఉండేందుకు కార్యాలయాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ ముంతాజ్ అలీ జావేద్, కౌన్సిలర్స్ కోలుగురి సురేష్, పొనగంటి రాము, చుంచు రమాదేవి, మైస రవి, ఒగ్గు రమేష్,బండ శ్రీనివాస్, సహకార సంఘం చైర్మన్ పొనగంటి సంపత్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## హుజూరాబాద్ వార్త

# ఇందిరమ్మ ఇల్లు గృహా ప్రవేశానికి హాజరైన ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి...

జమ్మికుంట టౌన్ ప్రభాతవార్త;
ఇందిరమ్మ ఇళ్ల నూతన గృహ ప్రవేశానికి స్థానిక శాసన సభ్యులు పాడి



కౌశిక్ రెడ్డి, జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ (దిలీప్)తో కలిసి హాజరయ్యారు.జమ్మికంట మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డులో మంద సమ్మయ్య దంపతుల ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశానికి ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి హాజరై లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, బూరుగుపల్లి రాము, శివ తదితరులు పాల్గొన్నారు.

# పూర్వ విద్యార్థుల విరాలాలతో స్టేజ్ షెడ్ నిర్మాణం.....

**ప్రధానోపాధ్యాయుడు.**

.వీణవంక, ప్రభాత వార్త:
వీణవంక మండల కేంద్రంలో నీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో




చదివి,వివిధ హోదాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థుల విరాలాల తో అదే పాఠశాలలో స్టేజ్ షెడ్ నిర్మాణం కోసం లక్ష రూపాయల అందజేయడంతో మంగళవారం స్టేజ్ నిర్మాణం కావడం జరిగిందని,విరాళలాలు అందజేసిన పూర్వ విద్యార్థులకు ప్రస్తుత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పులి అశోక్ రెడ్డి పేరు పేరున బుధవారం కృతజ్ఞతలు తెలిపారు .కాగా షెడ్ రాయిశెట్టి రాజమలయ్య ఆధ్వర్యములో నిర్వహించబడింద నీ ప్రధానోపాధ్యాయుడు తెలిపారు.

# బండి సాయి భగీరథ్ అరెస్టుకు బీఆర్ఎస్ ఆందోళన

గోదావరిఖని చౌరస్తాలో ఉద్రిక్తత..

కేంద్ర మంత్రి బండి సంజయ్‌పై తీవ్ర విమర్శలు

గోదావరిఖని ,ప్రభాతవార్త:



బీ ఆర్ ఎస్ శ్రేణులు గోదావరిఖనిలో తీవ్ర నిరసన చేపట్టాయి. మైనర్ బాలికపై అత్యాచారం ఆరోపణలు ఎదుర్కొంటున్న బండి సాయి భగీరథ్‌ను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ పట్టణ చౌరస్తాలో గులాబీ పార్టీ నేతలు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పై కూడా తీవ్ర విమర్శలు గుప్పించారు.ఆందోళనలో పాల్గొన్న నేతలు సాయి భగీరథ్ చిత్రపటానికి చెప్పుల దండ వేసి నిరసన వ్యక్తం చేయగా, బండి సంజయ్ చిత్రపటంపై "షేమ్ షేమ్" అంటూ నినాదాలు చేశారు. నిరసనకారులు, పోలీసుల మధ్య కొంతసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.ఈ సందర్భంగా బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు వ్యాళ్ల హరీష్ రెడ్డి మాట్లాడుతూ, "గత మూడు నెలలుగా జరుగుతున్న అకృత్యాల నుంచి బండి సాయి భగీరథ్‌ను కాపాడేందుకు బండి సంజయ్ తన పదవిని ఉపయోగిస్తున్నాడు" అంటూ ఆరోపించారు. అదే సమయంలో బాధిత బాలిక కుటుంబంపైనే హనీట్రాప్ ఫిర్యాదు నమోదు కావడం విచారకరమని వ్యాఖ్యానించారు.రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ వ్యవహారంలో స్పందించకపోవడాన్ని ఆయన తీవ్రంగా తప్పుబట్టారు.ప్రధానమంత్రి ఒత్తిడికి సీఎం లొంగిపోయారు. సిట్ విచారణ పేరుతో నిందితుడికి బెయిల్ మార్గం సుగమం చేసే ప్రయత్నం జరుగుతోంది" అని ఆరోపించారు.కేసును నీరుగార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని పేర్కొన్న హరీష్ రెడ్డి, నిందితుడిని వెంటనే అరెస్టు చేసి రాష్ట్ర మహిళలకు భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు.ఈ నిరసన కార్యక్రమంలో మాజీ కోఆప్షన్ సభ్యురాలు తస్లీమా భాను, పర్స స్వాతి, జాహిద్ పాషా, పోలాడి శ్రీనివాసరావు, బూర్ల వంశీకృష్ణ, బొట్ల పోచం, కృష్ణస్వామి, కొండ సురేష్, పోయిల రవి, ఉదయ్, శైలజ, కుమారి, రజిత, ఇంద్ర, భాగ్యలక్ష్మి, సరోజన, ధరణి, అనసూయ, అశ్విని తదితరులు పాల్గొన్నారు.

# చైతన్యం నింపే పాటలు యువతకు ఎంతో అవసరం

ఎగిరే పావురమా పాటలు ఆవిష్కరించిన ఎస్సై రమేష్

ఓదెల,ప్రభాతవార్త:

ఓదెల మండలం గుంపుల గ్రామంలో కర్రు సుదర్శన్ రచించిన "ఎగిరే పావురమా" అనే సామాజిక సందేశాత్మక పాటను పోత్కపల్లి ఎస్ఐ దీకొండ రమేష్ మంగళవారం ఆవిష్కరించారు. ఈ పాటను ప్రముఖ గాయకుడు గర్జన ఆలపించగా, విల్సన్ సంగీతాన్ని అందించారు. సమాజంలో పెరుగుతున్న కుల వివక్ష, అక్రమ సంబంధాల కారణంగా జరుగుతున్న హత్యలు, యువత చెడు మార్గంలో నడవడం, కుట్రలతో ప్రపంచ యుద్ధ పరిస్థితులు వంటి అనేక సమకాలీన అంశాలను ఈ పాటలో ప్రతిబింబించారు. శాంతి, మానవత్వం అలాగే ప్రేమకు ప్రతీకగా పావురాన్ని దూతగా తీసుకొని సమాజానికి బలమైన సందేశాన్ని రచయిత కర్రు సుదర్శన్ అందించారు.ఈ సందర్భంగా ఎస్ఐ రమేష్ మాట్లాడుతూ సమాజంలో



చైతన్యం కలిగించే ఇలాంటి పాటలు మరింత రావాలని కోరారు. గ్రామ సర్పంచ్ సమ్మక్కతో కలిసి రచయిత సుదర్శన్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు. మరిన్ని మంచి సామాజిక అవగాహన కలిగించే పాటలు రాయాలని అభినందించారు.ఈ కార్యక్రమంలో ఊరగోండ వినయ్ ,గ్రామ కార్యదర్శి రాకేష్ వర్మ, జీపీఓ సదయ్య, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# నాణ్యమైన విద్య ఫలాలు 100 శాతం ప్రజలకు చేరాలి

జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

ఎడ్యుకేషన్ వీక్ కార్యక్రమంపై ప్రజాప్రతినిధులతో సమావేశం

పెద్దపల్లి, ప్రభాతవార్త:

ప్రభుత్వ పాఠశాలలో జరుగుతున్న అభివృద్ధి , అందిస్తున్న నాణ్యమైన



విద్య ఫలాలు 100 శాతం ప్రజలకు చేరేలా స్థానిక ప్రజాప్రతినిధులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష కోరారు. 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రాణాలకు కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న విద్యా శాఖకు సంబంధించిన కార్యక్రమాలు పై సర్పంచులు, కార్పొరేటర్లు, మున్సిపల్ కౌన్సిలర్లతో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లిజిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ,లి గత రెండేళ్లుగా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు. కొత్త తరగతి గదుల నిర్మాణం, మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం, విద్యుత్ సమస్యల పరిష్కారం, పెయింటింగ్ తదితర పనులు చేపట్టామని చెప్పారు. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో వచ్చిన మార్పు స్పష్టంగా కనిపిస్తోందని, రాబోయే 5 నుండి 10 సంవత్సరాల వరకు ఉపయోగపడే విధంగా మౌలిక వసతులు సృష్టిస్తున్నామని అన్నారు. అధికారులు అన్ని వివరాలు అందిస్తారని, స్థానిక ప్రజాప్రతినిధులు క్రమం తప్పకుండా పాఠశాలలను సందర్శించి బోధన విధానం, విద్యార్థుల్లో నైపుణ్యాల అభివృద్ధి ఎలా జరుగుతోందో పరిశీలించి సూచనలు ఇవ్వాలని కోరారు. కేవలం మౌలిక వసతులపైనే కాకుండా విద్యా ప్రమాణాలపై కూడా సమీక్ష చేయాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి శారద, అకాడమిక్ మానిటరింగ్ అధికారి పీఎం. షేక్ ,సెక్టోరియల్ ఆఫీసర్ మల్లేశం, జిసిడిఓ కవిత, ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# సింగరేణి కాలనీలో చేపల పెంపకం ద్వారా యువతకు ఉపాధి కల్పించాలి

కలెక్టర్ కోయ శ్రీ హర్ష

మత్స్యశాఖ అధికారులతో సమావేశం నిర్వహించిన కలెక్టర్

**పెద్దపల్లి జిల్లా బ్యూరో, ప్రభాతవార్త:** సింగరేణి కాలనీలో చేపల పెంపకం ద్వారా యువతకు ఉపాధి కల్పించాలని లిజిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్షలి అధికారులను ఆదేశించారు. బుధవారం ఐడీఓసీ కార్యాలయంలో మత్స్యశాఖ అధికారులతో నిర్వహించిన సమావేశంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షలి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాబార్డ్ అధికారులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా చేపల పెంపకం, చేపల సాగు విధానాలపై వివరంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా లిజిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ,లి రామగుండం సింగరేణి కాలనీలో బొగ్గు తవ్వకాలు పూర్తైన తర్వాత అక్కడ మిగిలిన చెరువును బొమ్మ చేపల పెంపకానికి వినియోగించే



అవకాశాలు ఉన్నాయని తెలిపారు. చేపల పెంపకం ద్వారా కనీసం 50 మందికి జీవనోపాధి, ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యమని పేర్కొన్నారు. మత్స్యశాఖ నిపుణుడు సాయికృష్ణ ప్రాజెక్టు డీపీఆర్‌పై వివరాలు వెల్లడించినట్లు తెలిపారు. బొమ్మ చేపల పెంపకానికి సిద్ధంగా ఉన్న యువతను గుర్తించాలని జిల్లా మత్స్యశాఖ అధికారులను ఆదేశించారు. వచ్చే 20 రోజుల్లో ప్రాజెక్టును గ్రౌండింగ్ చేసి, అవసరమైన ప్రణాళికలు, లబ్ధిదారుల గుర్తింపు తదితర ప్రక్రియలను పూర్తి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా మత్స్యశాఖ అధికారి పి. నరేష్ కుమార్ నాయుడు, ఎల్‌డీఎం వెంకటేష్, కేవీకే రామగుండం శాస్త్రవేత్తలు, డీడీఎం నాబార్డ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పెద్దపల్లి వార్త



## అక్రమ కేసులకు భయపడేది లేదు

సుల్తానాబాద్ కోర్టుకు హాజరైన బిజెపి నాయకులు



**సుల్తానాబాద్, ప్రభాతవార్త:** రైతుల హక్కుల కోసం పోరాడుతున్న తమపై నమోదు చేసిన కేసులు అక్రమమైనవేనని బీజేపీ నాయకులు ఆరోపించారు. ఎన్ని కేసులు పెట్టినా రైతుల శ్రేయస్సు కోసం పోరాటం ఆగదని స్పష్టం చేశారు.2023 ఏప్రిల్‌లో సుల్తానాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని సుగ్లాంపల్లి తదితర ఐకెపి కేంద్రాల్లో వడ్ల కొనుగోలులో తాలు పేరుతో రైతులకు నష్టం జరుగుతోందని బీజేపీ నాయకులు ఆందోళనలు చేపట్టారు. మున్సిపల్ బీజేపీ అధ్యక్షుడు కూకట్ల నాగరాజు ఆధ్వర్యంలో ఐకెపి కేంద్రాలను పరిశీలించి, ఎలాంటి కటింగ్‌లు లేకుండా వడ్లు కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ రాస్తారోకో నిర్వహించారు.ఈ ఘటనలపై పోలీసులు ఐపీసీ సెక్షన్లు 143, 341, 149 కింద కేసులు నమోదు చేశారు. కేసు విచారణలో భాగంగా బుధవారం సుల్తానాబాద్ కోర్టు కు బీజేపీ రాష్ట్ర నాయకులు, మాజీ జిల్లా అధ్యక్షుడు రావుల రాజేందర్‌తో పాటు పోల్సాని సంపత్‌రావు, తంగెళ్ల రాజేశ్వరరావు, దాడి సంతోష్, ఎర్రోళ్ల శ్రీకాంత్, బెజ్జంకి దిలీప్, ఉప్పు కిరణ్, కొల్లూరి సంతోష్, ఉషణ అన్వేష్, వేగోలం మల్లికార్జున్ తదితరులు హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతుల పక్షాన నిలబడటం తప్పు కాదని, రైతులకు అన్యాయం జరిగితే భవిష్యత్తులోనూ బీజేపీ తరపున పోరాటాలు కొనసాగిస్తామని తెలిపారు.

## ప్రభుత్వ ఆసుపత్రికి కుర్చీలు అందజేత

కాల్వ శ్రీరాంపూర్ ప్రభాతవార్త:



మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి మండల కేంద్రానికి నికి చెందిన జక్కబోయిన రాజమ్మ ఇటీవల మృతి చెందగా రాజమ్మ స్మారకార్థం ఆమె మనవళ్లు మనవరాళ్లు బుధవారం ప్రభుత్వాసుపత్రికి కుర్చీలు అందజేశారు. కుర్చీలు అందజేసిన వారికి డాక్టర్ మహేందర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## మల్లన్న సన్నిధిలో మాజీ జెడ్పిటిసి గంట జన్మదిన వేడుకలు

ఓదెల,ప్రభాతవార్త:

పెద్దపల్లి జిల్లాలోని అతిపెద్ద శైవ క్షేత్రం ఓదెల శ్రీ మల్లికార్జున స్వామి దేవస్థానం ఆవరణలో హరిపురం గ్రామ సర్పంచ్ గ్యారవేని విజయ నాగరాజు యాదవ్ ఆధ్వర్యంలో ఓదెల తాజా మాజీ జెడ్పిటిసి గంట రాములు యాదవ్ 49వ జన్మదిన సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి, కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు అనంతరం వారు మాట్లాడుతూ ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు సుఖ సంతోషాలతో ఉండాలని రానున్న రోజులలో మరిన్ని పదవులు చేపట్టి ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలని ఓదెల శ్రీ మల్లికార్జున స్వామి ఆశీస్సులు ఉండాలని కోరారు ఈ కార్యక్రమంలో శానగొండ సర్పంచ్ జీల రాజు యాదవ్, అబ్బిడిపల్లి మాజీ సర్పంచ్ ఒజ్జా శ్రీనివాస్, నాయకులు రేగుల తిరుపతి, దాసరి కుమార్, ముప్పు రాకేష్, కాశవేని నరేష్, తుమ్మల లక్ష్మయ్య, బేరం అనిల్, అసరి మహేందర్, వంగ శ్రీనివాస్, వేల్పుల ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.



# చొప్పదండి వార్త



# చొప్పదండి ఎమ్మెల్యే ఆదేశాలతో దిగివచ్చిన మిల్లర్లు

**మిల్లర్లతో చర్చించి ఒప్పించిన జేసి**

**42 కిలోల తోనే ధాన్యం కొనుగోలు**

చొప్పదండి,ప్రభాతవార్త:

ఎట్టకేలకు రైతుల ధాన్యం కొనుగోళ్ల విషయంలో చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం యుద్ధ ప్రాతిపదిక మీద కరీంనగర్ జిల్లా జాయింట్ కలెక్టర్ ను ఆదేశించడంతో బుధవారం చొప్పదండి తాసిల్దార్ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ మహేష్, కొండగట్టు ఉత్సవ కమిటీ చైర్మన్ ఇప్ప శ్రీనివాస్ రెడ్డి, చొప్పదండి సింగిల్ విండో చైర్మన్ మల్లారెడ్డి, ఆర్నకొండ విండో చైర్మన్ వినుపాల తిరుపతిరావు, ఆత్మ చైర్మన్ గుర్రం రాజేందర్ రెడ్డి, తాసిల్దార నవీన్ కుమార్ లతోపాటు పలువురు అధికారులు మిల్లర్లతో పాటు లారీ అసోసియేషన్ తో సమావేశం నిర్వహించారు.



ఈ సందర్భంగా 42 కిలోలతో కొనుగోలు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. తూకం వేసిన ధాన్యాన్ని తరలించేందుకు చొప్పదండి లోకల్ పరిధిలోని 30 లారీలు, కరీంనగర్ నుండి 20 లారీలు కేటాయించారు. మరో ప్రక్క మండలంలోని రుక్మాపూర్ గ్రామంలో సర్పంచ్ కర్రె ప్రేమలత శ్రీనివాస్, తహసిల్దార్ నవీన్ కుమార్, మార్కెట్ చైర్మన్ మహేష్, విండో చైర్మన్ మల్లారెడ్డిలు ప్రత్యేక చొరవ చూపడంతో రైతుల ట్రాక్టర్లే రవాణాకు వినియోగిస్తామని హామీ ఇవ్వడంతో ఆ గ్రామ పరిధిలోని కొనుగోలు సెంటర్ల ధాన్యం ట్రాక్టర్లలో తరలించేందుకు ఏర్పాటు చేశారు. ఎట్టకేలకు గత వారం పది రోజుల నుండి ఇబ్బందులు పడుతున్న రైతుల సమస్యను చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం చొరవతో సద్దుమణిగి కొనుగోళ్ల వేగవంతం తో పాటు రవాణాకు అనుగుణంగా వాహనాలను కూడా ఖరారు చేయడంతో రైతుల ఇబ్బందులు తొలిగాయి. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పెరుమండ్ల మానస గంగయ్య, డి సి ఎస్ ఓ నర్సింగారావు, సివిల్ సప్లై డిఎం రజనీకాంత్ రెడ్డి, డి టి సి ఎస్ ఉష, డి టి మన్మిత్ సింగ్, ఆర్ ఐ త్రిపాల్ సింగ్, రహీం తోపాటు మిల్లర్లు, లారీ అసోసియేషన్ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## మ్యాడంపల్లిలో క్షయ వ్యాధి నిర్ధారణ శిబిరం

మల్యాల/ప్రభాత వార్త



మల్యాల మండలంలోని మ్యాడ పల్లి గ్రామంలో గల పలు ఇటుక బట్టీలలో పనిచేస్తున్న కార్మికులకు బుధవారం టీబీవ్యాధి నివారణ శిబిరం నిర్వహించి 116 మందికి టిబి నిర్ధారణపరీక్షలు నిర్వహించినట్లు డిప్యూటీ డి ఎం హెచ్ ఓ శ్రీనివాస్ తెలిపారు, ముఖ్యంగా ఇటుక బట్టీలలో పనిచేస్తున్న కార్మికులకు ఆకలి మందగించుట, దగ్గు, దమ్ము, తెమడ వంటి సమస్యలు ఉంటే తెమ్మడ పరీక్షలు నిర్వహించి, వారికి ఆరు నెలల పాటు మందులను అందజేయడం జరుగుతుందని ఆయన తెలిపారు,

## రుక్మాపూర్ లో స్కూల్ రెడీ నెస్ మేళ

చొప్పదండి,ప్రభాతవార్త:



మండల పరిధిలోని రుక్మాపూర్ గ్రామపంచాయతీ ఆవరణలో బుధవారం ప్రతం ఫౌండేషన్ గ్రామాల్లో జరగబోయే స్కూల్ రెడీనెస్ మేళ కార్యక్రమాన్ని నిర్వహించడం లో భాగంగా ఆహ్వాన పత్రికను గ్రామ సర్పంచ్ కర్రె ప్రేమలత శ్రీనివాస్ లకు అందించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ చిరంజీవి, గ్రామ కార్యదర్శి విజయ, ప్రతం ఫౌండేషన్ చొప్పదండి మండల కోఆర్డినేటర్ ముద్దసాని రేఖ, దొంతి సారపు సంపత్ తోపాటు పలువురు పాల్గొన్నారు.

## ప్రతి గింజను కొనుగోలు చేస్తాం..

**రైతులు ఆందోళన చెందవద్దు**

**అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్రీనివాస్ రెడ్డి**

**వెలిచాల ధాన్యం కొనుగోలు సందర్శన..**

రామడుగు, ప్రభాతవార్త



ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తున్న అని రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం రామడుగు మండలం వెలిచాల గ్రామ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాస్ రెడ్డి సందర్శించి కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ, రైతులకు అందుతున్న సేవలు, సహకార సంఘం పనితీరును ఆయన స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన కొనుగోలు కేంద్రాల్లో పారదర్శకత పాటిస్తూ రైతులకు వేగవంతమైన సేవలు అందించా లని అధికారులను ఆదేశించారు. రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని ఆలస్యం లేకుండా కొనుగోలు చేసి, మిల్లులకు త్వరితగతిన తరలించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. స్థానిక రైతులతో మాట్లాడిన అదనపు కలెక్టర్, ప్రభుత్వం రైతుల పక్షాన నిలుస్తోందని, ప్రతి గింజను కొనుగోలు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి నర్సింగరావు, రామడుగు తహసీల్దార్ రాజేశ్వరి, సహకార సంఘం ప్రతినిధులు, వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## పట్టాదారు పాసు పుస్తకం ఉన్న రైతులందరూ నమోదు చేసుకోవాలి

చొప్పదండి,ప్రభాతవార్త:



చొప్పదండి మండలంలోని అన్ని గ్రామాల పట్టాదారు పాసుపుస్తకం ఉన్న రైతులందరూ రైతు నమోదు (ఫార్మర్ రిజిస్ట్రీ) లో మే 31 లోపు తప్పకుండా నమోదు చేసుకోవాలని వ్యవసాయ అధికారి మమత పేర్కొన్నారు. రైతు నమోదు చేసుకున్న రైతులకు మాత్రమే కేంద్ర ప్రభుత్వ పథకాలు, ఎరువుల కొనుగోలుకు, పంట రుణాలు, ధాన్యం విక్రయాలకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. నమోదు చేసుకొని రైతులకు ఎలాంటి పథకాలు అందవని, అందుకే రైతులు తప్పనిసరిగా రైతు నమోదు చేసుకోవాలని కోరారు. రైతులందరూ వారికి సంబంధించిన వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదించి రైతు నమోదు చేసుకోవాలని కోరారు.

## మల్యాల ప్రభుత్వ కళాశాల లెక్చరర్ల అడ్మిషన్స్ డ్రైవ్

మల్యాల/ ప్రభాతవార్త

మల్యాల మండలం కేంద్ర లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ అడ్మిషన్ల కోసం కళాశాలకు చెందిన లెక్చరర్లు పూర్ణిమ, రచన లు అడ్మిషన్ డ్రైవ్ కార్యక్రమాన్ని చేపట్టారు, ఈ మేరకు తకలపల్లిలో సర్పంచ్ చీకట్ల లతను కలిసి గ్రామానికి చెందిన పదవ తరగతి విద్యార్థులను కళాశాలలో చేర్పించేందుకు కోరారు,, ఈ సందర్భంగా తమ కళాశాలలో డిజిటల్ క్లాసెస్ తోపాటు మూడెకరాల విశాలమైన స్థలంలో ఆటస్థలం ఆహ్లాదకరమైన వాతావరణం లో కళాశాల లో మెరుగైన విద్యాబోధన తోపాటు యూనిఫామ్ పుస్తకాలను అందజేయడం జరుగుతుందని, విద్యార్థులకు బ్రేక్ ఫాస్ట్ లంచ్ కూడా ఈ సంవత్సరం ప్రవేశ పెట్టడం జరుగుతుందని వివరించారు, ఈ సందర్భంగా గ్రామంలోని పదవ తరగతి పాసైన విద్యార్థులను తల్లిదండ్రులను సంప్రదించి కళాశాలకు చెందిన వసతులను ఉత్తీర్ణతను వివరించి ఈ సంవత్సరం కళాశాలలో అడ్మిషన్ పొందుటకు అంగీకారం కుదుర్చుకున్నారు, అంతేకాకుండా సర్పంచ్ లత ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన విద్యార్థులను మల్యాల కళాశాలలో చేర్పిస్తామని హామీ కూడా ఇచ్చారని లెక్చరర్లు పూర్ణిమ, రచన తెలిపారు, అడ్మిషన్ల కోసం సహకరించిన సర్పంచి లతకు లెక్చరర్లు కృతజ్ఞతలు తెలిపారు,



## కొండగట్టు అంజన్న ఆలయంలో కొనసాగుతున్న భక్తుల రద్దీ

మల్యాల/ ప్రభాతవార్త



ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో పెద్ద హనుమాన్ జయంతి భక్తుల రద్దీ బుధవారం కూడా కొనసాగింది, స్వామి వారి పుట్టినరోజు ఉత్సవాలు ఆదివారం ప్రారంభమై మంగళవారం ముగిసినప్పటికీ అనేకమంది దూర ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు కొండపైనే రాత్రి బస చేసి బుధవారం తెల్లవారుజాము పుణ్యస్నాన ఆచరించి శ్రీ స్వామివారిని దర్శించుకుని వారి ప్రాంతాలకు వెళ్లిపోయారు, దీంతో బుధవారం రోజు కూడా ఆలయంలో భక్తుల రద్దీ కొనసాగింది, ఆలయ ఈవో అంజన రెడ్డి ఆధ్వర్యంలో అధికారులు ఎప్పటికప్పుడు ఏర్పాట్లను పర్యవేక్షి ంచారు,

## సేవా సమితి అద్వర్యంలో హనుమాన్ చాలీసా పారాయణం

చొప్పదండి,ప్రభాతవార్త:

హనుమాన్ జయంతి సందర్భంగా సాయి మహిళా సేవా సమితి అధ్యక్షురాలు దండె లావణ్య అద్వర్యంలో బుధవారం సాయిబాబా మందిరంలో 11సార్లు హనుమాన్ చాలీసా పారాయణం ఘనంగా చేశారు. లోక కళ్యాణార్థం, అందరు ఆయురారోగ్యాలతో సుభీక్షంగా ఉండాలని అంజన్న కు విశేష పూజలు చేశామని సేవా సమితి సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన సభ్యులు దండె లావణ్య, దూస లావణ్య, బ్రహ్మణపెల్లి లత, దూస అరుణ, శారధ పిట్టల పద్మావతి, దండె జమున, కావ్య, కొత్తపెల్లి మంజుల, మంద విజయ, బొంగోని అరుణ, దండే లింగన్న తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిభా పురస్కారం అందుకున్న ఉత్తమ ఫోటోగ్రాఫర్ శ్రీనివాస్

మల్యాల /ప్రభాతవార్త



మల్యాల మండల కేంద్రానికి చెందిన సీనియర్ ఫోటోగ్రాఫర్, ఉత్తమ ఫోటోగ్రాఫర్ అవార్డు గ్రహీత మండల శ్రీనివాస్ ను బుధవారం జగిత్యాల జిల్లా కేంద్రంలో విశ్వకర్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారాన్ని అందుకున్నారు, 2026 ఉత్తమ ప్రతిభ పురస్కారాల కార్యక్రమంలో భాగంగా బెస్ట్ ఫోటోగ్రాఫర్ గా శ్రీనివాస్ కు విశ్వకర్మ సంఘం నాయకులు అవార్డు అందజేయడంతో పాటు సన్మానించారు,

# నిరుపేదల సొంతింటి కలను నిజం చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

### -ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

చందుర్తి ప్రభాతవార్త:



నిరుపేదల సొంతింటి కళను నిజం చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. చందుర్తి మండలం ఎన్గల్ గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమానికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం లబ్ధిదారులకు నూతన వస్త్రాలను అందజేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ, పేదల సొంతింటి కలను నిజం చేయడమే



ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన ప్రతి కుటుంబానికి గౌరవప్ర దమైన నివాసం కల్పిం చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాధ, మాజీ జడ్పిటిసి సభ్యుడు నాగం కుమార్, సర్పంచ్ శోభారాణి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు చింతపంటి రామస్వామి నాయకులు ఎనగంటి శంకర్, లాండే తిరుపతి, సత్తయ్య, గసికంటి ప్రభాకర్, ఎదురుగట్ల అజయ్, లాండే సత్యంతదితరులు పాల్గొన్నారు.

# త్వరలోనే వేములవాడ నియోజక వర్గానికి పబ్లిక్ స్కూల్

- సమాజానికి బలమైన పునాదులు పాఠశాలలు
- ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

వేములవాడ, ప్రభాతవార్త:

కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో హైదరాబాద్, ఢిల్లీ పబ్లిక్ స్కూల్ తరహాలో తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటు జరుగుతున్నాయని, ప్రతి నియోజక వర్గంలో 25 ఎకరాల్లో 200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను ఏర్పాటు చేస్తుందని, త్వరలోనే వేములవాడ నియోజక వర్గంలో కూడా ఏర్పాటు చేయనున్నట్లు ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. బుధవారం వేములవాడ పట్టణ పరిధిలోని నాంపల్లిలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం సందర్భంగా విద్యా వారోత్స వాల్లో భాగంగా వేములవాడ నియోజక వర్గ స్థాయి గ్రామ సర్పంచ్, మున్సిపల్ కౌన్సిలర్లకు కార్యశాల కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం ఆయన మాట్లాడుతూ పాఠశాలలు సమాజానిక బలమైన పునాదులని అన్నారు. ప్రజాప్రతినిధులు తరుచుగా పాఠశాలలను



సందర్శించాలని సూచించారు. సర్పంచ్‌లు, మున్సిపల్ చైర్మన్లు, కౌన్సిలర్లు తమ గ్రామాల వార్డుల పట్టణంలోని పాఠశాలలకు మద్ధతు ఇవ్వడం ద్వారా పిల్లల ఉజ్వల భవిష్యత్‌కు పునాదులు వేసిన వారు అవుతారని తెలిపారు. తద్వార ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికలు పెరుగుతాయని, చదువుల మానివేతలు తగ్గుతాయని, తల్లిదండ్రులకు ప్రభుత్వ విద్యపై నమ్మకం పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డీఈఓ జగన్మోహన్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్లు తాళ్లపల్లి ప్రభాకర్, బొజ్జ మల్లేశం, కొనరావుపేట సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు బోయిని దేవరాజు తదితరులున్నారు.

# యువత దుర్వ్యసనాలకు దూరంగా ఉండాలి

- క్రీడలతో ఆరోగ్యం, మంచి భవిష్యత్
- బిఆర్ఎస్ వేములవాడ ఇన్‌ఛార్జి చల్మెడ
- కెసిఆర్ కప్ క్రికెట్ పోటీ విజేతలకు బహుమతులు

వేములవాడ, ప్రభాతవార్త:



యువత దుర్వ్యసనాలకు దూరంగా ఉండాలని బిఆర్ఎస్ వేములవాడ ఇన్‌ఛార్జి చల్మెడ లక్ష్మినర్సింహ రావు సూచించారు. యువ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు నిర్వహించిన కెసిఆర్ కప్ క్రికెట్ టోర్నీ బుధవారం ముగిసింది. ముగింపు కార్యక్రమానికి బిఆర్ఎస్ వేమువాడ ఇన్‌ఛార్జి చల్మెడ లక్ష్మినర్సింహ రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా స్థాయిలో రాణించిన మొదటి రన్నర్ అప్ వేములవాడకు చెందిన 7, 8వ వార్డు తిప్పాపూర్ జట్టుకు ప్రోత్సాహక బహుమతిగా రూ.1లక్షను అందజేశారు. అలాగే జిల్లా స్థాయిలో రెండవ రన్నరప్‌గా నిలిచిన భగవంతరావు నగర్ 26, 27వ వార్డులకు చెందిన జట్టుకు ప్రోత్సాహక బహుమతిగా రూ.50వేలను అందజేశారు. ఈ సందర్భంగా టోర్నీలో పాల్గొన్న అన్ని జట్లకు క్రికెట్ కిట్లను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కెసిఆర్ కప్‌తో క్రికెట్ క్రీడాకారులకు క్రీడా స్ఫూర్తి పెంపొందడమే కాకుండా గ్రామీణ స్థాయి నుంచి క్రీడాకారులు తమ ప్రతిభను చాటారన్నారు. క్రీడలతో ఆరోగ్యం, మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కెడిసిసి బ్యాంక్ డైరెక్టర్ ఏనుగు తిరుపతి రెడ్డి, సీనియర్ నాయకులు రామతీర్థపు రాజు, నిమ్మశెట్టి విజయ్, వెంగళ శ్రీకాంత్ గౌడ్, వాసాల శ్రీనివాస్, కొండ కనకయ్య, సిరిగిరి చందు, గూడూరు మధు, సుంకపాక రాజు, పెద్ది రాజు, హనుమంతు, లైశెట్టి మల్లేశం, అంజద్ పాషా, మామిండ్ల కనకయ్య, మంత సందీప్, ఉమర్, రాకేష్ తదితరులున్నారు.

# దివ్యాంగులకు ప్రభుత్వం అండ

### -ఎమ్మెల్యే సంజయ్ కుమార్

జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:

దివ్యాంగులకు ప్రభుత్వం అండగా ఉన్నదని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ పేర్కొన్నారుజగిత్యాల జిల్లా విద్యాశాఖ జగిత్యాల సమగ్ర శిక్ష, ఏ ఎల్ ఐ ఎం సి ఓ వారి ఆధ్వర్యంలో బుధవారం జగిత్యాల పట్టణ ఓల్డ్ హైస్కూల్లో ప్రత్యేక అవసరాలు గల 123 మంద విద్యార్థులకు సహాయ ఉపకరణాల,ట్రై సైకిల్స్, వీల్ చైర్స్,వినికిడి పరికరాలు ఉపకరణాలు విద్యార్థులకు పంపిణీ చేసిన జగిత్యాల శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్ . అనంతరం దివ్యాంగుల కోసం 2.5 లక్షల తో ఏర్పాటు చేసిన భవిత కేంద్రాన్ని ప్రారంభించారు .ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ సమిండ్ల వాణి శ్రీనివాస్ కమిషనర్ సత్య ప్రణవ్ జిల్లా పార్టీ అధ్యక్షులు నందయ్య ఎంపీడీవో విజయలక్ష్మి మ్ర,కౌన్సిలర్ అరవ లక్ష్మీ మ్రరాజు కోఆప్షన్ సభ్యులు గట్టు సతీష్ కౌన్సిలర్లు కూతురు రాజేష్ కూతురు శేఖర్ పిఆర్టియు జిల్లా అధ్యక్షులు ఆనంద్ రావు ఎస్ ఓ లు మహేష్ చంద్రశేఖర్ రెడ్డి ఏఈ విజయ్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.






# ప్రభుత్వ కళాశాలలోనే నాణ్యమైన విద్య

### -సర్పంచ్ పులి సత్యం

చందుర్తి / ప్రభాతవార్త:



ప్రభుత్వ కళాశాలలోనే నాణ్యమైన విద్య లభిస్తుందని చందుర్తి సర్పంచ్ పులి సత్యం అన్నారు, 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించిన ప్రభుత్వ జూనియర్ కళాశాల కరపత్రాన్ని బుధవారం గ్రామపంచాయతీ కార్యాలయంలో కళాశాల అధ్యాపక బృందంచే ఆవిష్కరించారు, ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని విద్యాభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తున్నారన్నారు, విద్యాశాఖపై రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించి విద్యా విధానంలో సమూల మార్పులు చేస్తున్నారన్నారు, విద్యార్థులు ప్రభుత్వ కళాశాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు, అధ్యాపకులు కృపాకర్ మాట్లాడుతూ చందుర్తి ప్రభుత్వ కళాశాలలో ఈ విద్యా సంవత్సరం మంచి ఫలితాలు రావడం జరిగిందని, అదే స్ఫూర్తితో రానున్న విద్యా సంవత్సరంలో ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేస్తామన్నారు, చందుర్తి కళాశాలలో ఎంపీసీ,బైపీసీ, సిఈసి కోర్సులు అందుబాటులో ఉన్నాయని ఆంగ్లంలో బోధన చేయడం జరుగుతుందన్నారు, అలాగే చందుర్తి కళాశాలలో డిజిటల్ తరగతులు అందుబాటులో ఉన్నాయన్నారు, కళాశాలలో విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం కూడా అందుబాటులోకి రానుందని తెలిపారు, చందుర్తి మండల ప్రజలతో పాటు పరిసరాల విద్యార్థులు ప్రభుత్వ కళాశాలను సద్విని చేసుకోవాలన్నారు, ఈ కార్యక్రమంలో అధ్యాపక బృందం పాల్గొన్నారు.

# కొనుగోలు కేంద్రాల్లో టార్పాలిన్ అందుబాటులో ఉంచాలి

### -అదనపు కలెక్టర్ గడ్డం నగేష్

చందుర్తి, ప్రభాతవార్త:

ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులకు సరిపడా టార్పాలిన్ కవర్లు అందుబాటులో ఉండాలని, రైస్ మిల్లుల్లో ధాన్యం అన్ లోడింగ్ వేగవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ ఆదేశించారు. చందుర్తి మండలం లో మల్యాల, మూడపల్లి, చందుర్తి కొనుగోలు కేంద్రాలను అదనపు కలెక్టర్ తనిఖీ చేసి, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు, రైస్ మిల్లుల యజమానులకు పలు సూచనలు చేశారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులు తీసుకువచ్చే ధాన్యాన్ని జాప్యం చేయకుండా తూకం వేయాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. వర్షాల నేపథ్యంలో అన్ని కొనుగోలు కేంద్రాల్లో సరిపడా టార్పాలిన్లు అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు. రైతుల నుండి ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే ట్యాబ్ ఎంట్రీ పూర్తి చేయాలన్నారు. సేకరించిన ధాన్యాన్ని మిల్లులకు తరలించడానికి సంబంధిత కాంట్రాక్టర్లతో మాట్లాడి వాహనాలు ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాలను, మిల్లులను అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల నుండి రైస్ మిల్లులకు వాహనాల ద్వారా తరలించిన ధాన్యం బస్తాలను వేగంగా దింపుకొని, తిరిగి వాహనాలను కొనుగోలు కేంద్రాలకు పంపించేల చూడాలని రైస్ మిల్లర్ల యజమానులను అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ ఆదేశించారు. మిల్లులకు వచ్చిన ధాన్యం అన్ లోడ్ ప్రక్రియ వేగవంతం చేయాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్ వెంట చందుర్తి తాసిల్దార్ లాగిశెట్టి భూపతి ఐకెపి సిబ్బంది ఉన్నారు.



# విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి

ప్రైవేటు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు పనిచేయాలి

పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచాలి

ఎమ్మెల్యే సంజయ్ కుమార్

జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:

విద్యాభివృద్ధికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ పేర్కొన్నారుప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా బుధవారం జగిత్యాల పద్మనాయక కళ్యాణ మండపం లో జగిత్యాల నియోజకవర్గ స్థాయి విద్యా వారోత్సవాలలో సర్పంచులు కౌన్సిలర్లకు అవగాహన సదస్సు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జగిత్యాల శాసన సభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్ ఎమ్మెల్యే మాట్లాడుతూ రాజకీయాలు ఎన్నికల వరకు పరిమితం...నేను విద్య అభివృద్ధి కి చిత్తశుద్ధి తో పని చేస్తున్నా..విద్య వైద్యానికి జగిత్యాల ఒక కేంద్రంగా మారబోతోంది.అందరి సహకారం అవసరం.ప్రభుత్వ పాఠశాలలో మోలిక సదుపాయాలు కల్పన కోసం,అమ్మ ఆదర్శ పాఠశాల స్కీమ్ లో ప్రభుత్వం కృషి చేస్తోందని ,విద్యార్థులకు మంచి డైట్,కాస్మొటిక్,నాణ్యమైన భోజనం,దుస్తులు,అన్ని వసతులు కల్పించాలని ప్రభుత్వం కృషి చేస్తుంది



అన్నారు.ప్రభుత్వ పాఠశాలలో చదువే పేద మధ్యతరగతి పిల్లలకు అండగా ఉపాధ్యాయులు నిలవాలని మంచి ఫలితాల సాధన కోసం కృషి చేయాలని అన్నారు.విద్యా తో వికాసం అని,విద్య తో సామాజిక ఆర్థిక అసమానతలు తొలగుతాయి అని అన్నారు.ప్రభుత్వ పాఠశాలలో హాజరు శాతం పెరిగే విదంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు.తెలంగాణ రాష్ట్రంలో ప్రవేట్‌కి దీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్యా వసతులు ఉన్నాయని పాఠశాలల బలోపేతానికి ఉపాధ్యాయులు ప్రజా ప్రతినిధులు చొరవ చూపాలని కోరారు.ఈ కార్యక్రమంలో జగిత్యాల మున్సిపల్ చైర్పర్సన్ వాణి శ్రీనివాస్ , ఎంపీడీవోలు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పీఎం సేతు పథకాన్ని జిల్లాలో సమర్థవంతంగా అమలు చేయాలి

సింగరేణి, ఎన్టీపీసీ సంస్థలతో భాగస్వామ్యానికి చర్యలు తీసుకోవాలి

జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

పెద్దపల్లి జిల్లా బ్యూరో, ప్రభాతవార్త:

పీఎం సేతు పథకాన్ని పెద్దపల్లి జిల్లాలో సమర్థవంతంగా అమలు చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. పీఎం సేతు పథకం అమలు పై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష బుధవారం ఐడీఓసీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా 1000 ఐటీఐలను ఆధునీకరించేందుకు పీఎం సేతు (శివీ శీజుగిగీ) పథకం ప్రవేశపెట్టిందని కలెక్టర్ తెలిపారు. ఈ పథకం క్రింద 50 శాతం నిధులు కేంద్ర ప్రభుత్వం 33 శాతం నిధులు రాష్ట్ర ప్రభుత్వం 17 శాతం నిధులు పరిశ్రమలు భరించి ఐటిఐ క్లస్టర్లను ఆధునికరిస్తూ ప్రస్తుత అవసరాలకు తగిన విధంగా అభివృద్ధి చేయడం జరుగుతుందని అన్నారు. పెద్దపల్లి జిల్లాలో ఈ పథకాన్ని అమలు చేసేందుకు సింగరేణి కాల్లిరీస్ కంపెనీ లిమిటెడ్, ఎన్టీపీసీ లిమిటెడ్ సంస్థలతో భాగస్వామ్యం కోసం చర్చలు జరుపుతున్నామని అన్నారు.



సింగరేణి ఎన్టీపీసీ అధికారులు వారి సంస్థల హెడ్ ఆఫీసులతో చర్చించి అవసరమైన అనుమతులు, నిధుల మంజూరు పొందాలని కోరారు. ఈ పథకం అమలులో భాగంగా ఏర్పాటు చేసే ప్రత్యేక ప్రయోజన వాహకం ద్వారా నిధుల వినియోగం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. యువత నైపుణ్యాభివృద్ధి కోసం ఐటీఐల ఆధునీకరణ అత్యవసరమని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు నిర్వహణలో పరిశ్రమల ప్రతినిధులు కూడా భాగస్వాములుగా ఉండే విధంగా ప్రత్యేక ప్రయోజన వాహకం వ్యవహరిస్తుందని కలెక్టర్ వివరించారు. ఈ సమావేశంలో సిపిఓ రవీందర్, సింగరేణి సంస్థలు, ఆర్జీ 1, ఆర్జీ 2, ఆర్జీ 3 ,ఎన్టీపీసీ సంస్థల అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# మానకొండూరులో ఘోర రోడ్డు ప్రమాదం

వివాహ వేడుకలు వెళ్లి వస్తుండగా ఘటన..

ఖాదర్ గూడెంలో ఆర్టీసీ బస్ కారు ఢీకొన్ని ఇద్దరు మృతి

మరొకరికి తీవ్ర గాయాలు..

మానకొండూర్, ప్రభాతవార్త :



వివాహ వేడుకలకు వెళ్లి తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా ఆర్టీసీ బస్ కారు ఢీకొన్న సంఘటనలో ఇద్దరు మృతి చెందగా మరొకరి తీవ్ర గాయాలైనట్లు సంఘటన మానకొండూరు మండల కేంద్రంలోని ఖాదర్ గూడెంలో బుధవారం రాత్రి ఘటన చోటు చేసుకుంది. గ్రామస్తులు, తెలిపిన వివరాల





ప్రకారం.. మంచిర్యాల జిల్లా పట్టణ కేంద్రానికి చెందిన కె.వి వరప్రసాద్, సుమతి, ఖలీద్ డ్రైవర్ రాజు తో పాటు మరో ఇద్దరు మహిళలు వరంగల్ జిల్లాలో జరిగిన వివాహ వేడుకలకు హాజరై తిరిగి కరీంనగర్ వైపు కారులో వెళ్తుండగా మానకొండూరు మండల పరిధిలోని ఖాదరగూడెం జగిత్యాల వరంగల్ ప్రధాన జాతీయ రహదారిపై ఆర్టీసీ బస్సు కారు ఢీకొన్న సంఘటనలో ఖలీద్ డ్రైవర్ రాజు ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. సుమతికి తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. సుమతి పరిస్థితి విషమంగా ఉందని తెలిపారు. సమాచారం తెలుసుకున్న స్థానిక పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని కారులో ఇరుక్కుపోయిన రాజును స్థానిక ప్రజల సహకారంతో బయటకు తీశారు. వివాహ వేడుకల్లో పాల్గొని తిరిగి కారులో వస్తుండగా డ్రైవర్ రాజు గూగుల్ మ్యాప్ ద్వారా డ్రైవింగ్ చేసుకుంటూ కరీంనగర్ వెళ్తుండగా ఖాదర్ గూడెం వద్ద ఆర్టీసీ బస్సుకు ఎదురుగా పోయి కారు ఢీకొనడంతో ఘోర ప్రమాదం చోటు చేసుకుందని స్థానికులు తెలిపారు.

# రోడ్లపై పశువులను వదిలితే కఠిన చర్యలు

ఎస్ఐ ఉమా సాగర్ హెచ్చరిక

జగిత్యాల,రూరల్ ప్రభాతవార్త:

జగిత్యాల రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో రాత్రివేళల్లో పశువులను రోడ్లపై వదలడం వల్ల రోడ్డు ప్రమాదాలు నిత్యకృత్యమవుతున్నాయని ఎస్ఐ ఉమా సాగర్ ఆందోళన వ్యక్తం చేశారు. రోడ్లపై యథేచ్ఛగా సంచరిస్తున్న ఆవులు, ఎద్దుల కారణంగా వాహనదారులు,ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని,చీకటిలో పశువులు కనిపించక అనేకమంది ప్రమాదాల బారిన పడుతున్నారని ఆయన పేర్కొన్నారు.ఈ సందర్భంగా పశువుల



యజమానులకు ఆయన కీలక సూచనలు చేశారు.పశువులను రోడ్లపైకి వదలకుండా రాత్రి సమయంలో ఖచ్చితంగా సురక్షిత ప్రాం తాల్లో కట్టివేయాలని ఆదేశించారు. నిబంధనలను అతిక్రమించి పశువులను రోడ్లపైకి వదిలే యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అంతేకాకుండా,నిబంధనలు ఉల్లంఘిస్తే పశువులను ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.ప్రజల ప్రాణాలను దృష్టిలో ఉంచుకుని పశువుల యజమానులు పోలీసు శాఖకు సహకరించాలని ఎస్ఐ ఉమా సాగర్ కోరారు.



# బాధిత కుటుంబాలను పరామర్శించిన మాజీ మంత్రి

బుగ్గారం ప్రభాతవార్త:



బుగ్గారం మండల కేంద్రంలో బుధవారం రోజున మాజీ సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ బుగ్గారం మండల కేంద్రానికి బిఆర్ఎస్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు నక్క జితేందర్ తల్లి నక్క మల్లవ్వ మరియు రామగిరి లక్ష్మణ్, కప్పల పెద్ద గంగారం వివిధ కారణాలతో ఇటీవలే మృతి చెందగా వారి కుటుంబాలను బుధవారం నాడు మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పరామర్శించి వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఆయన వెంట మండల బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

# ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం

బుగ్గారం ప్రభాతవార్త:



బుగ్గారం మండల కేంద్రంలో బుధ వారం రోజున తెలంగాణ ప్రభుత్వం ద్వారా తెలంగాణ రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సహ కారంతో మంజూరైన విలా సాగరపు లక్ష్మి పోషరాజు ఇందిరమ్మ ఇల్లును స్థానిక సర్పంచ్ నక్క రాజవ్వ , ఉప సర్పంచ్ జంగ లావణ్య శ్రీనివాస్ లతో కలిసి ప్రారంబించారు. ఈ కార్య క్రమంలో కాంగ్రెస్ మండల నగునూరు నర్సా గౌడ్, గ్రామ శాఖ అధ్యక్షులు కోడిమ్యల రాజన్న, దాసర్తి పోసన్న తదితరులు పాల్గొన్నారు.

# నర్సింగాపూర్ శివారులో ప్రభుత్వ భూమి రక్షణ హద్దులు నిర్ణయించిన అధికారులు

జగిత్యాల,రూరల్ ప్రభాతవార్త:



జగిత్యాల మండలం రూరల్ నర్సింగాపూర్ గ్రామ శివారులో గల శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ కెనాల్ భూమి కబ్జాకు గురైనట్లు ఫిర్యాదులు రావడంతో రెవెన్యూ,ఇరిగేషన్ అధికారులు రంగంలోకి దిగారు.నర్సింగాపూర్ డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నుండి నర్సింగాపూర్ గేట్ల వరకు ఉన్న ప్రభుత్వ భూమిని కొంతమంది ఆక్రమించడంతో,గ్రామ సర్పంచ్ కుక్కునూరి వంశీ ఆధ్వర్యంలో గ్రామస్తుల సహకారంతో అధికారులు బుధవారం రోజున భూ హద్దులను నిర్ణయించారు.జగిత్యాల రూరల్ తహసీల్దార్ సాదాబ్ హకీమ్, ఇరిగేషన్ శాఖ డివిజనల్ ఇంజనీర్ ఖాన్ స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యటించి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ, ఆక్రమణకు గురైన ప్రభుత్వ ఎస్ఆర్ఎస్పి భూమిని తిరిగి స్వాధీనం చేసుకున్నామని,ఈ భూమిని గ్రామ అవసరాల నిమిత్తం,ముఖ్యంగా ఐకేపీ సెంటర్ నిర్వహణ కోసం వినియోగించుకోవాలని సూచించారు.ప్రభుత్వ భూములను కబ్జా చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో రెవెన్యూ గిర్ధవార్లు చిట్యాల భూమయ్య,శ్యామ్షోద్దీన్, జిపిఓ శ్రీనివాస్,నర్సయ్య,ఇరిగేషన్ ఏఈ, లష్కర్లతో పాటు ఐకేపీ సిబ్బంది,గ్రామస్తులు పాల్గొన్నారు.

# ప్రశాంత వాతావరణంలో బక్రీద్ జరుపుకోవాలి

- కలెక్టర్ చిత్రా మిశ్రా
- పకడ్బందీ బందోబస్తు చర్యలు చేపడుతున్నాం
- సీపీ గౌష్ ఆలం
- బక్రీద్ పండుగ ఏర్పాట్లపై సమీక్ష సమావేశం




**కరీంనగర్ కలెక్టరేట్,ప్రభాతవార్త:**

బక్రీద్ పండుగను ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకునేలా అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని కలెక్టర్ చిత్రా మిశ్రా ఆదేశించారు. బక్రీద్ పండుగ ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో పాటు ముస్లిం మత పెద్దలతో బుధవారం కరీంనగర్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం, జిల్లా స్థాయి అధికారులు, ముస్లిం మత పెద్దలు, కార్పొరేటర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముస్లిం సోదరులు బక్రీద్ పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని కోరారు. పండుగ సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు పక్కాగా ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు. ముస్లిం మత పెద్దల సూచనలు, సలహాలను స్వీకరించి అధికారులకు పలు దిశానిర్దేశాలు చేశారు. బక్రీద్ నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ సూచించారు. పశువుల అక్రమ రవాణా నిరోధానికి పకడ్బందీ చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈద్గాల వద్ద అవసరమైన మౌలిక వసతులు కల్పించడంతో పాటు నమాజ్ సమయంలో విద్యుత్ అంతరాయం లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. మసీదుల పరిసరాల్లో పారిశుధ్య చర్యలు చేపట్టాలని, చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా వేస్ట్ కవర్లను పంపిణీ చేయాలని సూచించారు. తాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా సమయానికి నీరు అందేలా చూడాలని సంబంధిత శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం మాట్లాడుతూ బక్రీద్ పండుగ సందర్భంగా అన్ని రకాల భద్రతా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. నగరంలో పూర్తి స్థాయి బందోబస్తు నిర్వహిస్తూ పండుగను సామరస్య వాతావరణంలో నిర్వహించుకు నేలా చర్యలు తీసుకుంటున్నా మని పేర్కొన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ రెవెన్యూ డి శ్రీనివాస్ రెడ్డి, అడిషనల్ డీసీపీ వెంకటరమణ, ఆర్డీవోలు మహేశ్వర్, రమేష్ బాబు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# దేశంలో ఎస్సీ క్రైస్తవులకు అన్యాయం జరుగుతుంది

## ఆల్ ఇండియా క్రిస్టియన్ ఫెడరేషన్ పెద్దపల్లి పార్లమెంట్ సమన్వయకర్త పల్లె శాంతిరాజు

**పెద్దపల్లి-ప్రభాతవార్త:**

దేశంలో ఎస్సీ క్రైస్తవులకు అన్యాయం జరుగుతుందనీ ఆల్ ఇండియా




క్రిస్టియన్ ఫెడరేషన్ పెద్దపల్లి పార్లమెంట్ సమన్వయకర్త పల్లె శాంతిరాజు అన్నారు. పెద్దపల్లి జిల్లా యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో దళిత క్రైస్తవులకు షెడ్యూల్డ్ కుల హక్కుల శాంతి ర్యాలీ బుధవారం పెద్దపల్లిలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆల్ ఇండియా క్రిస్టియన్ ఫెడరేషన్ పెద్దపల్లి పార్లమెంట్ సమన్వయకర్త పల్లె శాంతిరాజు మాట్లాడుతూ, ప్రస్తుతం అమల్లో ఉన్న షెడ్యూల్డ్ కులాల ఉత్తర్వుల ప్రకారం హక్కులు కేవలం హిందూ మతానికి మాత్రమే పరిమితం చేయబడినట్లు తెలిపారు. అనంతరం సిక్కు మతానికి 1956లో, బౌద్ధ మతానికి 1990లో ఈ హక్కులు విస్తరించినప్పటికీ, క్రైస్తవ మతాన్ని అనుసరిస్తున్న దళితులకు ఇప్పటికీ న్యాయం జరగడం లేదన్నారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 14 ప్రకారం చట్టం ముందు అందరికీ సమానత్వం కల్పించాల్సి ఉండగా, మతం ఆధారంగా హక్కులు నిరాకరించడం సమానత్వ సూత్రానికి విరుద్ధమని పేర్కొన్నారు. ఆర్టికల్ 15(1) ప్రకారం మతం ఆధారంగా వివక్ష నిషేధించబడినా, దళిత క్రైస్తవులపై వివక్ష కొనసాగుతోందన్నారు. ఆర్టికల్ 16(2) ప్రకారం ప్రభుత్వ ఉద్యోగాల్లో సమాన అవకాశాలు కల్పించాల్సి ఉండగా, ఎస్సీ హక్కులు లేకపోవడంతో అవకాశాలు కోల్పోతున్నారని తెలిపారు. అలాగే ఆర్టికల్ 17 ప్రకారం అంటరానితనాన్ని రద్దు చేసినప్పటికీ, సామాజిక వివక్ష ఇంకా కొనసాగుతోందని పేర్కొన్నారు. ఆర్టికల్ 21లోని గౌరవప్రదమైన జీవన హక్కు దెబ్బతింటోందని, ఆర్టికల్ 25 ప్రకారం మత స్వేచ్ఛ హక్కు ఉన్నప్పటికీ మత మార్పిడి చేసినందుకు శిక్ష విధించినట్లుగా పరిస్థితి ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. మతం మారినప్పటికీ సామాజిక వెనుకబాటుతనం, వివక్ష తొలగిపోవడం లేదని, కేవలం మతం ఆధారంగా ఎస్సీ హక్కులు నిరాకరించడం తార్కికత లేని వర్గీకరణ అని అభిప్రాయపడ్డారు. రాజ్యాంగ ప్రాథమిక సూత్రమైన సమానత్వానికి ఇది వ్యతిరేకమని పేర్కొన్నారు. 1950 ఆగస్టు 10న జారీ చేసిన రాష్ట్రపతి ఉత్తర్వులోని మత పరిమితిని రద్దు చేసి సవరణలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఏవో కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ నాతానియల్, ఆల్ పాస్టర్లు ఎన్. అశోక్, ప్రభాకర్, సుధాకర్, టి. డేవిడ్, వి. డానియల్, చందర్ పాల్, మేషక్, కుమార్, బి. డానియల్, జీ. రమేష్, నెల్సన్, గిద్యోను, శ్రీను పాలు, సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి తాండ్ర సదానందం, కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# వెను వెంటనే ధాన్యం తూకం వేయాలి

## -కలెక్టర్ బి. సత్య ప్రసాద్

**జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:**




జగిత్యాల జిల్లాలో కొనసాగుతున్న వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్, జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తో కలిసి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా అదనపు కలెక్టర్లు, ఆర్డీవోలు, జిల్లా స్థాయి అధికారులు, డీఎస్పీలు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు, ఎస్హెచ్వోలు, ఏపీఎంలు, ప్యాక్స్ సీఈఓలు, పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో కొనుగోలు చేసిన ధాన్యం 24 గంటల్లో మిల్లులల్లో అన్లోడ్ అయ్యేవిధంగా కొనుగోలు కేంద్రాల్లో కేటాయించబడిన అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులు కేంద్రాలకు తీసుకొచ్చే ధాన్యం వెంటనే కొనుగోలు చేసి మిల్లులకు తరలించేలా సమన్వయం చేయాలన్నారు. ట్రాన్స్ పోర్ట్ సమస్యలు లేకుండా అవసరమైన వాహనాలను సిద్ధంగా ఉంచాలని, అవసరమైతే స్థానిక ట్రాక్టర్లు, ఇతర వాహనాలను వినియోగించాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో స్థానిక హమాలీలను వినియోగించి వేగంగా లోడింగ్, అన్లోడింగ్ పనులు నిర్వహించాలని ఆదేశించారు. ఎక్కడైనా ఇబ్బందులు తలెత్తితే సంబంధిత అధికారులు వెంటనే స్పందించి పరిష్కరించాలని చెప్పారు. ప్రతి కొనుగోలు కేంద్రంలో ధాన్యం నిల్వలు ఎక్కువ కాలం ఉండకుండా నిరంతర పర్యవేక్షణ చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ చేతన్ నితిన్, జిల్లా అదనపు కలెక్టర్లు బి. ఎస్ లత, బి. రాజ గౌడ్, ఆర్డీవోలు, డిఎస్పీలు, జిల్లా స్థాయి అధికారులు, కలెక్టరేట్ ఏవో, తహసీల్దార్ లు, ఎంపిడివోలు ఎస్ హెచ్ఓలు ఏపిఎంలు, పిఎసిఎస్ సీఈఓ లో, సంబంధిత అధికారులు మరియు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల అభివృద్దే ప్రభుత్వ ధ్యేయం

## -ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే విజయ రమణారావు

## -బొంతకుంటపల్లి, నరసయ్యపల్లిలో పలు అభివృద్ధి పనుల ప్రారంభం

**సుల్తానాబాద్, ప్రభాతవార్త:**



గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని చింతకుంట విజయ రమణారావు అన్నారు. బుధవారం మండలంలోని బొంతకుంటపల్లి, నరసయ్యపల్లి గ్రామాల్లో పలు అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. బొంతకుంటపల్లిలో రూ.8 లక్షల వ్యయంతో నిర్మించిన ఎస్సీ కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభించారు. అనంతరం గ్రామంలో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయ రమణారావును గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. లింగంపల్లి కొమురయ్య, కొండ్ర స్వరూప ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బొంతకుంటపల్లి గ్రామ అభివృద్ధికి ఇప్పటివరకు రూ.43 లక్షలు ఖర్చు చేశామని తెలిపారు. గ్రామాల సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రకాష్‌రావు, సర్పంచులు శ్రీరంగారావు, జూపల్లి తిరుమలరావు, చిలుక సతీష్, లింగంపల్లి కొమురయ్య, ఎంపీడీవో దివ్యదర్శనరావు, పంచాయతీరాజ్ ఏఈ సచిన్, కొండ్ర స్వరూప తదితరులు పాల్గొన్నారు.

# రైతన్నను దోచుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం

## -మాజీ ఎమ్మెల్యే సుంకే రవిశంకర్

**రామడుగు,ప్రభాతవార్త:**



క్వింటాల్‌కు 8 కిలోల కట్ చేస్తూ రైతన్నను దోచుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం, రైతు ఆత్మహత్యలకు కారణం అవుతుందని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే రవిశంకర్ అన్నారు. చొప్పదండి నియోజకవర్గంలోని గంగాధర, రామడుగు, మల్యాల, బోయినపల్లి, చొప్పదండి మండలాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలు పూర్తిగా నిర్వీర్యంగా మారాయని బీఆర్ఎస్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే సుంకే రవిశంకర్ ఆరోపించారు. వేదిర గ్రామ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన ఆయన రైతులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. దాదాపు 160 గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినప్పటికీ ఇప్పటివరకు సరైన కొనుగోళ్లు జరగడం లేదని అన్నారు. వేదిర కేంద్రంలోనే 10 వేల నుంచి 15 వేల బస్తాలు నిల్వ ఉన్నాయని, లారీలు రాక ధాన్యం తరలింపులు ఆగిపోయాయని పేర్కొన్నారు. వర్షాలు పడితే ధాన్యం తడిసి రైతులు తీవ్రంగా నష్టపోతారని ఆందోళన వ్యక్తం చేశారు. ఒక్కో బస్తాపై మూడు కిలోల తరుగు తీస్తున్నారని, బీ గ్రేడ్ పేరుతో ఒక్కో క్వింటాల్‌పై రూ.20 వరకు నష్టం కలిగిస్తున్నారని ఆరోపించారు. అదేవిధంగా 7 నుంచి 8 కిలోల వరకు కట్ చేస్తున్నారని రైతులు వాపోతున్నారని తెలిపారు. ప్రైవేట్ వ్యాపారులు కూడా మద్దతు ధర కంటే తక్కువ ధరకు మాత్రమే కొనుగోలు చేస్తున్నారని అన్నారు. లారీలు రావాలంటే ఒక్కో బస్తాకు ఒక రూపాయి ఇవ్వాలని లారీ డ్రైవర్లు డిమాండ్ చేస్తున్నారని రైతులు తన దృష్టికి తీసుకొచ్చారని పేర్కొన్నారు. అలాగే 45 కిలోల బస్తాలు పెడితేనే లారీలు వస్తున్నాయని రైతులు చెబుతున్నారని తెలిపారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం ఉన్నప్పుడు ఐదు ఆరు రోజుల్లో ధాన్యం కొనుగోలు చేసి, వారం పది రోజుల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేసేదని గుర్తు చేశారు. కానీ ప్రస్తుతం రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. రైతుల ఆత్మహత్యలకు కాంగ్రెస్ ప్రభుత్వమే కారణమని ఆరోపించిన ఆయన, వెంటనే అధికారులు కొనుగోలు కేంద్రాలను సందర్శించి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రెండు రోజుల్లో పరిస్థితి మారకపోతే జిల్లా కలెక్టర్ కార్యాలయాలను బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ముట్టడిస్తామని హెచ్చరించారు.